మన ప్రజా అక్షర న్యూస్

TEL TEL - 20684

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం...




DIGITAL DAILY NEWS PAPER | 27 గురువారం మార్చి 2025 | సంపుటి:02 | సంచిక :35 | పేజీలు :08

PUBLISHED FROM HYDERABAD, NALGONDA, KARIMNAGAR, WARANGAL, KHAMMAM , VIJAYAWADA, VISHAKAPATNAM, TIRUPATHI

### కోర్టు అంశాలను అసెంబ్లీలో ఎలా ప్రస్తావిస్తారు


## సీఎం వ్యాఖ్యలపై కెటిఆర్ అభ్యంతరం



హైదరాబాద్,మార్చి26(ప్రజా అక్షరం): పార్టీ ఫిరాయింపులు, ఉప ఎన్నికలపై అసెంబ్లీ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఈ క్రమంలో సీఎం రేవంత్ కామెంట్స్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. రేవంత్ రెడ్డి ఆయన సీఎం అనే విషయం మర్చిపోతున్నారు.. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై అసెంబ్లీ వేదికగా తీర్పు ఇవ్వాలని యత్నం చేస్తున్నారని విమర్శించారు. న్యాయస్థానాల పరిధిలో ఉన్న అంశాలపై వ్యాఖ్యలు చేయవద్దని నిబంధనలు చెబుతున్నాయి.. కానీ సీఎం రేవంత్ రెడ్డి ఆ రూల్స్‌కు వ్యతిరేకంగా మాట్లాడారు. తాను నిబంధనలకు అతీతమని.. సుప్రీంకోర్టు కంటే ఎక్కువని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహారశైలిని న్యాయస్థానాల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఇకనైనా రేవంత్ రెడ్డి పాలనపై వ్యవహరించి పాలనపై దృష్టి సారించాలని.. సూచించారు.

## బెట్టింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు

హైదరాబాద్, మార్చి26(ప్రజా అక్షరం): ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌పై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. గేమింగ్, రమ్మీ కేసులు, చర్యలకు ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేస్తున్నట్లు అసెంబ్లీ వేదికగా సీఎం రేవంత్ ప్రకటన చేశారు. బెట్టింగ్ యాప్‌లు, ఆన్లైన్ బెట్టింగ్‌పై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అందుకోసం స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం వేయాలని నిర్ణయించామని.. కఠినమైన శిక్షల కోసం చట్టాలను సవరించాల్సిన అవసరం ఉందని వెల్లడించారు. బెట్టింగ్ నేరస్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా ఉంటుందని స్పష్టం చేశారు. నేరస్థులను కఠినంగా శిక్షించడానికి ప్రతిపక్షాలు సహకరించాలని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.



## కెసిఆర్ హయాంలో విద్యావ్యవస్థ మెరుగు

### కేంద్రగణాంకాలే ఇందుకు నిదర్శనం
### మండలిలో ఎమ్మెల్సీ కవిత

హైదరాబాద్,మార్చి26(ప్రజా అక్షరం):



తెలంగాణ శాసనమండలిలో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్సీ కవిత ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో విద్యావ్యవస్థ నాశనం అయిందని ప్రచారం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ గణాంకాలే సమాధానమని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన గణాంకాల ప్రకారం, గత పది సంవత్సరాల్లో తెలంగాణలో విద్యా వ్యవస్థ మెరుగుపడింది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య తగ్గిందని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని కవిత వ్యాఖ్యానించారు. 2014-15 నాటికి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 29,268 కాగా, 2023-24 నాటికి ఈ సంఖ్య 30,022కి పెరిగింది.

2 లో

### లోక్‌సభలో ప్రతిపక్ష

## గొంతు నొక్కే కుట్ర

2 లో




### స్పీకర్ సభ నడిపే తీరు ఇది కాదు
### మీడియాతో విపక్షనేత రాహుల్

### అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు

## నొక్కుస్తున్నారు


### సభా నిబంధనలకు విరుద్ధంగా సిఎం ప్రకటన
### పార్టీ మారిన ఎమ్మెల్యేలపై జడ్జిమెంట్ ఎలా ఇస్తారు
### అందుకే సభనుంచి వాకౌట్ చేశామన్న హరీష్ రావు



మిగతా 2 లో

### అసెంబ్లీలో వాడీవేడిగా మాటల యుద్ధం

## భట్టి వర్సెస్ కేటీఆర్




### నిరూపించకపోతే.. క్షమాపణలు చెప్పాలని భట్టి డిమాండ్

### కమీషన్ లేనిదే పనులు కావడం లేదంటూ కేటీఆర్ ఆరోపణలు

2 లో

## రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

### 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం
### త్వరలోనే కార్డుదారులకు మరిన్ని నిత్యావసర సరుకులు
### మేడిగడ్డపై విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు
### తుమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మించి తీరుతాం
### అసెంబ్లీలో స్పష్టం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



2 లో

మన ప్రజా అక్షరం డిజిటల్ పత్రిక
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# సంపాదకీయం

## పర్యావరణ విధ్వంసం !

దేశంలో ఎండలు ముదరుతున్నాయి. పట్టణాల్లో ఎండల తీవ్రత తీవ్రంగా ఉంటోంది. గ్రామాల్లోనూ ఎండలు మంటపుట్టిస్తున్నాయి. కోతుల బెడద కారణంగా గ్రామాల్లో ఇంటిముందున్న చెట్లను నరికి వేస్తున్నారు. కోతుల బెడ నుంచి ఇప్పటికి రక్షణకు కార్యాచరణ కానరావడం లేదు. అడవులను వదిలి అవి గ్రామాల్లో తిష్టవేశాయి. ఇక ప్రజలు మొక్కల పెంపకాన్ని వదిలి చల్లదనం కోసం కూలర్లు, ఎసిలు వాడుతున్నారు. దీంతో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. ఇదే సందర్భంలో కాలుష్యాన్ని కొని తెచ్చుకుంటున్నాం. మొక్కలు నాటడం,పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న విషయాలను పక్కన పెట్టారు. ఇదంతా ప్రభుత్వాల పని అన్నట్లుగా ప్రజల భావన ఉంది. అందమైన ఇల్లు కట్టుకుంటున్న వారు సైతం నాలుగు మొక్కలు నాటాలన్న స్పృహ లేకుండా పోతున్నది. మొక్కలు నాటేందుకు కొందరు చేస్తున్న ప్రయత్నాలు ఫోటోలకు పోజులిచ్చే కార్యక్రమంగా మారింది. తమ ఇళ్లల్లోనే ఓ మొక్కను నాటి గ్రీన్ ఛాలెంజ్ అంటూ ఇంతకాలం ప్రచారం చేసుకున్నారు. నిజానికి గ్రీన్ ఛాలెంజ్ అంటే గ్రామాల రూపురేఖలు మారాలి. కానీ అలా జరగడం లేదు. హరితహారంలో 200 కోట్లమొక్కలు నాటామిన ఘనంగా చెప్పిఉకున్న బిఆర్ఎస్ పాలకులు వాటి ఆనవాళ్లు ఎక్కడో చూపితే బాగుండేది. అలా జరిగితే కనీస మార్పు వచ్చి ఉండేది. చంద్రబాబు ఉమ్మడి ఎపిలో ఇలాంటి ప్రచారాలే చేసినా ఎక్కడా మొక్కల జాడలేదు. ప్రస్తుత పరిస్తితులు చూస్తుంటే ఇదంతా మనకుగా మనం చేసుకున్న పర్యావరణ విధ్వంసానికి ప్రత్యక్ష నిదర్శనంగా చెప్పు కోవాలి. అడవులను నరకడం, కాంక్రీట్ జంగల్‌ను పెంచడం, మొక్కల పెంపకాన్ని విస్మరించడం, భూగర్భ జలాలను తోడేయడం, ఇసుకను తవ్వితీయడం వంటి అనేకానేక చర్యలు పర్యావరణ విధ్వంసానికి కారణ మవుతున్నాయి. వాగులూవంకల జాడలేకుండా పోయింది. కొండలు, గుట్టలను తవ్వేస్తున్నాం. దీనికితోడు పర్యావరణ విధ్వంసానికి తోడ్పడే ప్లాస్టిక్ విపరీతంగా వినియోగిస్తున్నాం. ప్లాస్టిక్ ఎంతటి విధ్వంసం సృష్టిస్తుందో ఎండలను బట్టి అర్థం చేసుకోవచ్చు. ఏటా విధ్వంసం జరుగుతున్నా దానిని అడ్డుకునే కఠిన చర్యలను అవలంబించడం లేదు. ఎవరికి వారు మాకేంటిలే అన్న ధోరణిలో ఉన్నారు. ఇవే మనలను అనేకానేక రోగాలకు కారణం చేస్తున్నాయి. అంటువ్యాధుల నివారణకు పరిశుభ్రత ముఖ్యమని హెచ్చరి స్తున్నా ప్రజలు చలించడం లేదు. దశాబ్దాలుగా దేశంలో పర్యావరణ హితమైన చర్యలకు పాలకులు కట్టుబడకపోవడం వల్ల పచ్చదనం మాయమయ్యింది. పచ్చదనం అన్నది లేకుండా పల్లెల్లో ఉన్న చెట్లను ఎక్కడిక్కడ నరికి వేశారు. గతంలో ఇంటిముందు ఉండే చెట్లను కూడా డబ్బుకోసం అమ్ముకుంటున్నారు. ఇప్పుడు చాలా గ్రామాల్లో కోతుల బెడద కారణంగా చెట్లను తెగనరికి వేస్తున్నారు. అందుకే తెలుగు రాష్ట్రాలు ఎండవేడిమికి అతలాకుతలం అవుతున్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరిగి పోతున్నాయి. మండే ఎండలకు తోడు పలు రాష్ట్రాల్లోను తాగునీటికి కటకట ప్రారంభం అయింది. మూడునుంచి నాలుగు డిగ్రీలు సాధారణ ఉష్ణోగ్రతలకు అదనంగా నమోదవు తుండటంతో ప్రజలు బేజారెత్తుతున్నారు. ఉదయం నుండే మొదలవుతున్న ఎండవేడిమి సాయంత్రం అయినా ఎక్కడా తగ్గకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ క్రమంలో మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. అకాల వర్షాలు..తట్టుకోలేని ఎండలు..తట్టుకోలేని చలిగాలులు మనలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. పాలకులకు ఇవేవీ పట్టడం లేదు. ఎందుకంటే ఉన్నన్నాళ్లూ పదవి అనుభవించి.. తదుపరి ఏమైతే మాకేంటన్న ధోరణిలో ఉన్నారు. కోట్లాదిమంది చేస్తున్న విధ్వంసం అంటే ప్లాస్టిక్ వాడిపడేం, చెత్తాచెదారం తీసివేయడం వేలల్లో ఉన్న పారిశుద్య సిబ్బందికి సాధ్యం కాదు. కనీసం ఇక్కడైనా ప్రజలను కట్టుబాట్లు పెట్టివుంటే బాగుండేది. ప్రజలు పారిశు ధ్య పనులు లాంటివి ఎందుకనో చేయడం లేదు. దీంతో కాలుష్యం మళ్లీ పెరుగుతోంది. ఎక్కడిక్కడ చెత్తకుప్పలు పేరుకు పోతున్నాయి. ప్లాస్టిక్ వాడకంతో కాలువల్లో అవన్నీ నిండి మురుగునీటి పారుదల అస్తవ్యస్తంగా తయారయ్యింది. దేశ వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ప్రజలు కూడా చెత్తను బయటకు విసిరేసి చోద్యం చూస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ తమ బాధ్యత కాదన్న రీతిలో కాలం గడిపేస్తున్నారు. చెత్త పేరుకుపోయిందని ..అందుకు ప్రభుత్వానిదే బాధ్యతన్నట్లుగా దీరాలు తీస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ నిషేధం లాంటి విషయాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దగా పట్టింపు లేకుండా ఉన్నాయి. అందుకే ఏటా మొక్కలు నాటుతున్నా..భూగర్భ జలాలు ఇంకేలా చేస్తున్నా.. ఏయేటికాయేడు దేశంలో ఎండలు మండి పోతున్నాయి. పర్యావరణ విధ్వంసం పై దృష్టి పెట్టకపోవడంతో భానుడు చెలరేగిపోతున్నాడు. ఎండ వేడిమి, వడగాడ్పులతో ప్రజలు అల్లాడి పోతున్నారు. గతంలో ఎప్పుడూ లేనంతగా ఈ యేడు చలికాలం వణికిస్తే..ఎండాకాలం ఉడికిస్తోంది. ఇలాంటి విపరీత వాతావరణ పరిస్థితులకు మనం చేస్తున్న విధ్వంసం కారణమని గుర్తించడం లేదు. పాలకులతో పాటు.. ప్రజలు కూడా ఇందుకు బాధ్యులే. కొన్ని రోజులుగా క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుతున్నాయి. గాలిలో తేమ శాతం తగ్గిపోతోంది. మేఘాలు తొలగిపోయి పూర్తిగా పొడి వాతావరణం ఏర్పడడంతో సూర్యుని కిరణాలు నిటారుగా తాకుతుం డటంతో రేడియేషన్ పెరిగి భూమి బాగా వేడెక్కి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. మే వరకు ఇదే పరిస్థితి కొనసాగనుందని వాతావరణశాఖ నిపుణులు చెబుతున్నారు. దీనిని కనీసం కొంతయినా తగ్గించడానికి కొంతమేరకు అయినా పరిసరాల పరిశుభ్రతను అలవాటు చేసుకోవాలి. ఇందుకోసం నిరంకుశంగా అయినా ప్రభుత్వాలు ప్రజలను హెచ్చరించాలి. ప్రచండ భానుడి ప్రతాపానికి దేశం అల్లాడుతోందని ఊరుకుంటే ఇకముందు కూడా ఇలాగే ఉంటుంది. ప్రధానంగా గతంలో ఎన్నడూ లేని విధంగా మంచినీటి సమస్య కూడా తీవ్రం అయ్యింది. ఇలాగే మనం ముందుకు సాగితే దేశం ఎడారిగా మారుతుందనడంలో సందేహం లేదు. ఏటా ఎండాకాలం బాధలను వానాకాలంటో గుర్తుంచుకోక పోవడం వల్ల మంచినీటి సమస్యలు పునరావృతం అవుతున్నాయి. తాగునీరు కాదుకదా రోజువారీ వాడకానికి సరిపడా నీటికి కూడా కటకట తప్పడం లేదు. ప్రధాన జలాశయాలు అడుగంటి పోవడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకుంటున్నాయి. పాలకులు కూడా కఠినంగా చర్యలు తీసుకుని పర్యావరణ విధ్వంసాన్ని ఆపకపోతే రానున్న రోజులు మరింత భయంకరంగా ఉండడం ఖాయమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తు న్నారు. కనీసం ఒక్కొక్కరు ఒక్కో మొక్క నాటుతూ పోయినా కొంతయినా ఉపశమనం లభించేది. ప్రభుత్వాలను తిడుతూ కూర్చునే బదులు మన ఇంటినుంచే పరిశుభ్రత అన్నది అలవాటు కావాలి.

# భట్టి వర్సెస్ కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్, మార్చి26(ప్రజా అక్షరం):** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు పదోరోజు వాడీవేడిగా కొనసాగింది. పలు అంశాలపై సుదీర్ఘ చర్చ కొనసాగుతోంది.. ఈ క్రమంలో తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మధ్య మాటల యుద్ధం నడిచింది. ప్రభుత్వ పెద్దలు 30శాతం కమీషన్లు తీసుకుంటున్నారంటూ.. స్వయంగా కాంగ్రెస్ నేతలే మాట్లాడుకుంటున్నారంటూ అసెంబ్లీ వేదికగా కేటీఆర్ కామెంట్ చేశారు. అయితే.. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యల పట్ల డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 30శాతం కమీషన్లు తీసుకుంటున్నట్టు నిరూపించాలంటూ కేటీఆర్‌కు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సవాల్ చేశారు. నిరూపించలేకపోతే కేటీఆర్ క్షమాపణ చెప్పాలని భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యులు ఆందోళన చేశారు. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలంటూ భట్టి హెచ్చరించారు. దోచుకుంది మీరు.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది మీరే అంటూ బీఆర్ఎస్ నేతలపై భట్టి మండిపడ్డారు. కాగా.. కేటీఆర్ క్షమాపణ చెప్పాలంటూ కాంగ్రెస్ సభ్యుల ఆందోళన నేపథ్యంలో.. కేటీఆర్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రకటించారు. ధరణి, భూ భారతిపై కూడా తెలంగాణ అసెంబ్లీలో రచ్చ జరిగింది. ధరణిపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇంకా అదే చట్టాన్ని అమలుచేస్తున్నారు. ధరణిలో వివరాల ఆధారంగానే ఇప్పటికీ ప్రభుత్వ పథకాల అమలు జరుగుతుందని.. పైగా ఈ ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతిలో అనేక లోపాలు ఉన్నాయన్నారు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి. ఈ వ్యాఖ్యల పట్ల అధికార పార్టీ నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ధరణి ఓ దుర్మార్గమైన చట్టమంటూ డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు. పార్ట్-బీ పేరుతో భూములు దోచుకున్నారని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఉద్యమాలతో వచ్చిన చట్టాలను ఒక్క కలంపోటుతో వెనక్కు తీసుకెళ్లారు. ధరణిని బంగాళాఖాతంలో కలుపుతామని ఎన్నికల్లో చెప్పాం .. చెప్పినట్టుగానే భూ భారతిని తీసుకొచ్చామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

మొదటిపేజీ తరువాయి

# గొంతు నొక్కే కుట్ర

**న్యూఢిల్లీ,మార్చి26(ప్రజా అక్షరం):** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ స్పీకర్ ఓం బిర్లా తీరుపై మండిపడ్డారు. స్పీకర్ సభ నడుపుతున్న తీరు సరిగ్గా లేదని, ఇది అప్రజాస్వామికమని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నిసార్లు అభ్యర్థించినా స్పీకర్ తనకు మాట్లాడే అవకాశం ఇవ్వడంలేదని రాహుల్ ఆరోపించారు. రాహుల్ గాంధీ బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. 'సభలో ఏం జరుగుతుందో నాకు తెలియదు. నాకు మాట్లాడే అవకాశం ఇవ్వమని స్పీకర్‌ని ఎన్నిసార్లు అభ్యర్థించినా.. నాకు మాట్లాడేందుకు మైక్ ఇవ్వడం లేదు. సభను నడిపే పద్ధతి ఇది కాదు. ఎలాంటి ఆధారాలు లేకుండా స్పీకర్ నా గురించి అసత్యాలు మాట్లాడుతున్నారు. సభను పదేపదే వాయిదా వేస్తున్నారు. ఇదంతా ఎందుకు? నేను మాట్లాడేందుకు లేచి నిలబడడానికి ప్రయత్నించినప్పుడల్లా ఆయన లేచి వెళ్లిపోతున్నారు. సభలో మాట్లాడేందుకు ప్రతిపక్షసభ్యులకు మైక్ ఇవ్వాలి కదా. ఇవ్వడం లేదు. మేం ఏం చెప్పాలో అది చెప్పనివ్వడం లేదు. నేను ఏం చేయలేదు. నిశ్శబ్దంగా కూర్చున్నాను. ఒక్కమాట మాట్లాడలేదు. 7-8 రోజులుగా నాకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదు. ప్రధాని కుంభమేళా గురించి మాట్లాడారు. ఆ సమయంలో నేను నిరుద్యోగం గురించి మోడీని ప్రశ్నించాలని అనుకున్నాను. కానీ స్పీకర్ నాకు ఆ అనుమతి ఇవ్వలేదు. స్పీకర్ విధానం ఏంటో నాకు తెలియదు. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధం అని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో తాను మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేస్తున్న స్పీకర్ ఓం బిర్లా తనకు మైక్ ఇవ్వడం లేదని రాహుల్ గాంధీ స్పీకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు మైక్ ఇవ్వమంటే స్పీకర్ పారిపోతున్నారని అన్నారు. ఇది సభ నడిపే పద్ధతి కాదని, ఎలాంటి ఆధారాలు లేకుండా స్పీకర్ తనపై అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 'మేము ఏం చెప్పాలి అని అనుకుంటున్నామో అది చెప్పాలి కదా.. అందుకు మైక్ ఇవ్వాలి. కానీ ఇవ్వడం లేదు. లోక్‌సభలో ప్రతిపక్షానికి అవకాశం ఇవ్వకుండా కుట్ర జరుగుతోందని.. ప్రధాని కుంభమేళ గురించి మాట్లాడిన రోజు తాను నిరుద్యోగం గురించి మాట్లాడుదాం అనుకుంటే.. అవకాశం ఇవ్వలేదని తెలిపారు. ఈ స్పీకర్ విధానం అర్థం కావడం లేదని.. ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ధ్వజమెత్తారు.

# కెసిఆర్ హయాంలో విద్యావ్యవస్థ మెరుగు

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,మార్చి26(ప్రజా అక్షరం):** తెలంగాణ శాసనమండలిలో రాష్ట్రంలోని విద్యా వ్యవస్థపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఎమ్మెల్సీ కవిత ముఖ్యమైన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ హయాంలో విద్యావ్యవస్థ నాశనం అయిందని ప్రచారం చేసిన వారికి కేంద్ర ప్రభుత్వ గణాంకాలే సమాధానమని ఆమె పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో వెల్లడించిన గణాంకాల ప్రకారం, గత పది సంవత్సరాల్లో తెలంగాణలో విద్యా వ్యవస్థ మెరుగుపడింది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య తగ్గిందని కేంద్ర గణాంకాలే చెబుతున్నాయని కవిత వ్యాఖ్యానించారు. 2014-15 నాటికి తెలంగాణలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 29,268 కాగా, 2023-24 నాటికి ఈ సంఖ్య 30,022కి పెరిగింది. ఇది ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి నిదర్శనమని కవిత తెలిపారు. 2014-15లో రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల సంఖ్య 15,069 ఉండగా, 2023-24 నాటికి 12,126కి తగ్గిపోయింది. దీని అర్థం, ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. కేసీఆర్ పాలనలో విద్యావ్యవస్థ బలోపేతమైందని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి వల్ల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు మొగ్గుచూపారని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బోధన ప్రమాణాలు మెరుగుపడటంతో ప్రైవేట్ పాఠశాలలపై ఆధారపడే అవసరం తగ్గిందని ఆమె స్పష్టం చేశారు.తెలంగాణలో విద్యావ్యవస్థ నాశనం అయ్యిందని దుష్ప్రచారం చేసినవారికి కేంద్ర గణాంకాలే సమాధానమని ఎమ్మెల్సీ కవిత తేల్చిచెప్పారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య పెరగడం, ప్రైవేట్ పాఠశాలల సంఖ్య తగ్గిపోవడం విద్యా రంగంలో తెలంగాణ సాధించిన పురోగతికి నిదర్శనమని ఆమె అన్నారు.

# అసెంబ్లీలో ప్రతిపక్షం గొంతు నొక్కుస్తున్నారు

**హైదరాబాద్,మార్చి26(ప్రజా అక్షరం):** పార్టీ మారిన ఎమ్మెల్యేలు వాపస్ పోతారనీ డౌట్ వచ్చిందేమో.. అందుకే ఉప ఎన్నికలు రావని అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడాడని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసిన అనంతరం హరీశ్‌రావు మీడియాతో చిట్ చాట్ చేశారు. సుప్రీంకోర్టులో పెండింగులో ఉన్న పార్టీ ఫిరాయింపుల విషయమై నిబంధనలకు విరుద్ధంగా సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడారు. ముఖ్యమంత్రి సభలో మాట్లాడింది పూర్తిగా అసెంబ్లీ పార్లమెంట్ వ్యవస్థకు విరుద్ధం. కోర్టులో పెండింగులో ఉన్న విషయాలను చట్టసభల్లో మాట్లాడకూడదని పార్లమెంటరీ ప్రొసీజర్ బుక్‌లో స్పష్టంగా ఉంది. కోర్టు పరిధిని అధిగమించి ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో కేసు పెండింగులో ఉన్నా కూడా ముఖ్యమంత్రి అసెంబ్లీలో ఈ విషయంపై జడ్జిమెంట్ ఇచ్చాడు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై కారు, ఉప ఎన్నికలు రానే రావు అని జడ్జిమెంట్ ఇచ్చారు. ముఖ్యమంత్రి తన పరిధిని దాటి సుప్రీంకోర్టులో ఉన్న విషయం మీద మాట్లాడడం అసెంబ్లీ ప్రివిలేజ్ కిందకే వస్తుంది అని హరీశ్‌రావు పేర్కొన్నారు. అందుకే తాము సభలో అభ్యంతరం చెప్పామని, నిరసనగా వాకౌట్ చేశామని అన్నారు. పాయింట్ ఆఫ్ ఆర్డర్ కింద నేను చెప్పే ప్రయత్నం చేస్తే మధ్యలో నా మైక్ కట్ చేశారు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశాం. సలహాలు ఇవ్వాలంటే ఇవ్వచ్చని ముఖ్యమంత్రి చెప్పారు, కానీ సలహాలు ఇవ్వడానికి మైక్ ఇవ్వాలని కోరితే ఇవ్వలేదు. ప్రతిపక్షం గొంతు నొక్క ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ సభ్యులు ఉన్నవారికి మైక్ ఇస్తున్నారు, మాకు ఇవ్వడం లేదు అని హరీశ్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బెట్టింగ్ యాప్స్ బ్యాన్ చేస్తూ వచ్చింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలల పాలనలో బెట్టింగ్ యాప్స్‌ని కంట్రోల్ చేయడంలో విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు ఒక అత్యాచారం, ఆరు గంటలకు ఒక హత్య జరగుతున్నది. లా అండ్ ఆర్డర్ మెయిన్టైన్ చేయడంలో ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఫెయిలయ్యారు. ఒకరోజే హైదరాబాద్‌లో రెండు అత్యాచార ఘటనలు, రెండు హత్యలు జరిగాయి. హైదరాబాద్‌లో 50 శాతం సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. పెట్టిన సీసీ కెమెరాలును మెయింటైన్ చేయడంలో ఫెయిల్ అయ్యారు. పోలీసులకు ఆత్యాధునిక వాహనాలు మేం కొనిస్తే మీరు డీజిల్ పోయించే పరిస్థితిలో కూడా లేరు. పోలీస్ చరిత్రలో పోలీసు కుటుంబాలను పోలీసుల చేత అరెస్టు చేయించిన ఘనుడు సీఎం రేవంత్ రెడ్డి అని హరీశ్‌రావు విమర్శించారు. అమనగల్‌లో ముఖ్యమంత్రి భూముల కోసం నాలుగు లైన్ల రోడ్లు రింగ్ రోడ్డు, రీజనల్ రింగ్ రోడ్ ఉండగా మరో రోడ్డు ఎందుకని ప్రశ్నించారు. రూ. 5000 కోట్లు- ఖర్చుపెట్టి 10 లైన్ల రోడ్డు ఎందుకు వేస్తున్నావ్. ఉద్యోగులకు పెన్షనర్లకు ఇవ్వడానికి డబ్బులు లేవని చెబుతూనే రూ. 5000 కోట్లతో అత్తగారి ఊరికి రోడ్లు వేస్తారా? అని ప్రశ్నించారు. జానారెడ్డి గారిని ఆదర్శంగా తీసుకోండి అన్నారు సీఎం. ఎమ్మెల్యేల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వాలని కోరితే వెంటనే కేసీఆర్ వచ్చారు. మీరు కూడా ప్రతిపక్ష ఎమ్మెల్యేల నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏసీడీపీ నిధులు ఇవ్వండని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు భూములమ్మితే బొంద పెట్టడానికి కూడా స్థలం మిగలదు అని చెప్పి.. ఈరోజు అసెంబ్లీ సాక్షిగా భూముల అమ్మకాన్ని సమర్థిస్తున్నారు. గచ్చిబౌలిలోని 400 ఎకరాలను బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాడి కాపాడింది.. మీరు అధికారంలోకి వచ్చాక కోర్టు తీర్పు వచ్చిందని, వాటిని కాపాడకుండా అమ్మితే ఎలా అన్నారు.

# రేషన్‌కార్డు దారులకు సన్నబియ్యం

మొదటిపేజీ తరువాయి

**హైదరాబాద్,మార్చి26(ప్రజా అక్షరం):** ంషన్‌కార్డు దారులకు సన్నబియ్యం ఇస్తామన్న హామీని అమలు చేయబోతున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కొత్త రేషన్ కార్డుదారులతో కలసి అందరికీ దీనిని వర్తింప చేస్తామని అన్నారు. త్వరలోనే ఇతర నిత్యావసర వస్తువులను కూడా కార్డుదారులకు అందిస్తామని ప్రకటించారు. దేశంలోనే తొలిసారిగా ఈ నెల 30న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం సరఫరాకు శ్రీకారం చుడుతున్నట్లు- ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అసెంబ్లీలో మంత్రి మాట్లాడుతూ మేడిగడ్డ బ్యారేజీ అంశంలో విజిలెన్స్ నివేదిక వచ్చిందని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఎన్డీఎస్‌ఏ తుది నివేదిక వచ్చిన తర్వాత మరమ్మతుల విషయంపై దృష్టిసారిస్తామన్నారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా భాజపా ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు లేవలెత్తిన అంశాలపై మంత్రి వివరణ ఇచ్చారు. కాళేశ్వరం ఆనకట్టల డిజైన్, నిర్మాణం, నిర్వహణలో తీవ్రమైన లోపాలు ఉన్నాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీపీఆర్‌లో షీట్ పైల్స్ ఉంటే.. నిర్మాణంలో సీకెంట్ పైల్స్ వాడారని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగ ప్రమాదం దురదృష్టకరమని.. ప్రపంచస్థాయి నిపుణులను భాగస్వామ్యం చేసి సహాయక చర్యలను కొనసాగిస్తున్నట్లు ఉత్తమ్ తెలిపారు. ప్రమాదం జరిగిన 3 గంటల్లోపే తాను అక్కడికి వెళ్లినట్లు చెప్పారు. సీఎం రేవంత్ కూడా రెండు రోజుల క్రితం దీనిపై సమీక్షించి సహాయక చర్యలు వేగవంతం చేయాలని ఆదేశించారన్నారు. సొరంగ ప్రమాదం తాత్కాలికంగా వచ్చిన ఎదురుదెబ్బ మాత్రమేనని.. ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని చెప్పారు. తమ్మిడిహట్టి వద్ద ఆనకట్ట నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక, సాంకేతిక పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. వీలైనంత త్వరగా పనులు చేపడతామన్నారు. తక్కువ ఖర్చుతో త్వరితగతిన ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు.క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టి శీల పరీక్షను నిరూపించుకోవాలని పాల్వాయి హరీశ్ వ్యాఖ్యానించారు.కమిషన్ కె అంటే కాళేశ్వరం, కరెంటు కొనుగోళ్లు, కాకతీయ అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చురకలంటించారు. శాసన సభలో నిరసన తెలిపే అవకాశం ఉన్నప్పటికి లాబీలోకి వెళ్లి నిరసన తెలపడం సరికాదని ధ్వజమెత్తారు. సభ జరుగుతున్నప్పుడు ఫొటోలు, వీడియోలు తీయడం నిషేధమని, లాబీల్లో ఫొటోలు తీసిన బిఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్షల్స్‌పై బిఆర్ఎస్ సభ్యులు దౌర్జన్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. అవినీతి, అక్రమాలతోనే బిఆర్ఎస్‌ను ప్రజలు అక్కడ కూర్చోబెట్టారని, బిఆర్ఎస్ నేత కవిత లిక్కర్ స్కామ్ చేయడంతోనే ఢిల్లీలో ప్రభుత్వం పోయిందని ఎద్దేవా చేశారు. సభలో బిఆర్ఎస్ కావాలని హంగామా చేసిందని, కావాలని లాబీల్లోకి వెళ్లి షో చేశారని దుయ్యబట్టారు.

## వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి..

### - కాచువార్ మాజీ ఎంపిటిసి జి.బలరాం రెడ్డి

**నారాయణపేట, మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి )**



కృష్ణానది పరివాహక ప్రాంతమైన మక్తల్ నియోజకవర్గంలో రబీ సీజన్ కు సంబంధించిన వరి పంట కోతలు ఇప్పటికే విరివిగా కొనసాగుతున్నాయని, దీన్ని దృష్టిలో ఉంచుకొని తక్షణమే వరి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో పాటు రైతుల నుండి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని మాజీ ఎంపిటిసి జి.బలరాం రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుత రబీ సీజన్లో మక్తల్ నియోజకవర్గం లోని మక్తల్, కృష్ణ, మాగనూరు, నర్వ, అమరచింత, ఆత్మకూరు మండలాల్లో వేలాది ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేయడం జరిగిందన్నారు. వరి కోతలు ప్రారంభ మైనప్పటికీ ధాన్యం కొనేవారు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. గత ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ మేరకు వరి ధాన్యం కొనుగోలుకు బోనస్ అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. గత వానకాలం సీజన్లో పంట కొనుగోలు చేసినప్పటికీ ఇప్పటివరకు రైతులకు బోనస్ డబ్బులు అందజేయలేదని ఆయన అన్నారు. తక్షణమే బోనస్ కు సంబంధించిన నగదును రైతుల ఖాతాల్లో జమ చేయాలని బలరాం రెడ్డి డిమాండ్ చేశారు.

## ఉచిత హెల్త్ క్యాంపు

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**

అంతర్గాం మండలంలోని మద్దిరాల గ్రామం లో ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ సహకారంతో వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజల సంక్షేమం కోసం ఎన్టిపిసి సంస్థ రోహిణి ఫౌండేషన్ మరియు అంతర్గామ్ మండల పోలీసు శాఖ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వెంకట్ ఆధ్వర్యంలో దొరిశెట్టి శ్యాంసుందర్ పర్యవేక్షణలో ఉచిత హెల్త్ క్యాంపు సంయుక్తంగా నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్యేక వైద్య బృందం గ్రామ ప్రజలకు పలు వైద్య పరీక్షలు చేసి ఉచిత మెడిసిన్ అందజేయడం జరిగినది. వైద్య పరీక్షలో పాల్గొన్న గ్రామ ప్రజలంతా ఎమ్మెల్యే మక్కాన్సింగ్ రాజ్ ఠాగూర్ సహకారం పట్ల ఎన్టిపిసి యాజమాన్య సంస్థ పోలీసు శాఖ ఎస్సై వెంకట్ ఏర్పాటు చేసిన ఉచిత హెల్త్ క్యాంపు ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉన్నదని మా ప్రజలందరి పక్షాన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని హర్షం వ్యక్తం చేసినారు. ఈ కార్యక్రమం లో అంతర్గాం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు దొరిశెట్టి శ్యాం సుందర్,గ్రామ అధ్యక్షులు దొరిశెట్టి రాజేందర్, ముక్కెర మల్లయ్య ,ముక్కెర ప్రవీణ్,రాజ్ కుమార్,శ్రావణ్,నరేష్,సతీష్,ఫీల్డ్ అసిస్టెంట్ రాజేష్,సయాబ్,రాములు,గ్రామ పంచాయతీ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## దేవాలయానికి విరాళాన్ని అందజేసిన మాజీ జడ్పిటిసి..

**దేవరకద్ర, మార్చి 26 (ప్రజా అక్షరం న్యూస్)**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్రలోని శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానానికి బుధవారం దేవరకద్ర మండలం మాజీ జడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి రూ.2,52,369ల విరాళాన్ని అందజేశారు. శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానం నందు శివాలయం మరియు వీరప్పయ్య స్వామి గర్భగుడి శిఖరముల.. పునర్నిర్మాణం కోసం గత కొన్ని రోజులుగా స్థానిక భక్తులు దేవాలయానికి ముమ్మరంగా విరాళాలు అందజేస్తున్నారు. అందులో భాగంగానే కీర్తిశేషులు బల్సుపల్లి పెద్దరాంరెడ్డి జ్ఞాపకార్థం బల్సుపల్లి లక్ష్మీ దేవమ్మ, వారి కుమారుడు దేవరకద్ర మండలం మాజీ జడ్పిటిసి లక్ష్మీకాంత్ రెడ్డి-భారతి కుటుంబ సభ్యులు ఈ విరాళాన్ని దేవాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి విరాళాన్ని అందజేయడానికి వచ్చిన లక్ష్మీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులు ముందుగా దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆ తర్వాత విరాళాన్ని పూజారి నాగరాజు స్వామికి అందజేశారు. దేవాలయానికి విరాళం అందజేసిన లక్ష్మీకాంత్ రెడ్డి కుటుంబ సభ్యులపై అక్షింతలు తల్లి పురోహితులు ఆశీర్వచనం పలికారు. స్వామివారి ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, భజన పరులు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీ సద్గురు ఈశ్వర వీరప్పయ్య స్వామి దేవస్థానానికి తమ వంతు ఆర్థిక సహకార అందించాలన్న ఉద్దేశంతోనే ఈ విరాళాన్ని దేవాలయానికి అందజేసినట్లు లక్ష్మీకాంత్ రెడ్డి తెలిపారు.



# శ్రీ దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణకు మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి ఆహ్వానం

### ఆహ్వాన పత్రికను అందజేసిన విగ్రహ కమిటీ సభ్యులు

**భువనగిరి టౌన్ ప్రజా అక్షరం**


తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య 98 వ జయంతి సందర్భంగా ఏప్రిల్ 3 వ తేదీన బీబీనగర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహవిష్కరణ కార్యక్రమానికి రావాలని భువనగిరి మాజీ శాసనసభ్యులు పైల శేఖర్ రెడ్డి గారిని ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భువనగిరి మాజీ జెడ్పిటిసి సుబ్బూరు బీరు మల్లయ్య మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు టౌన్ పార్టీ అధ్యక్షులు ఏవి కిరణ్ రచ్చ శ్రీనివాస్ రెడ్డి నీలో ఓం ప్రకాష్ గౌడ్ గ్యార జిల్లా నాయకుడు ర్యాకల శ్రీనివాస్ జరిగిందివిగ్రహ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డి కొమురయ్య విగ్రహ కమిటీ చైర్మన్ సోము రమేష్ కురుమ, ముఖ్య సలహాదారులు జాన సత్యనారాయణ కురుమ, మండల కురుమ సంఘం అధ్యక్షుడు సోమ ముత్యాలు, ప్రధాన కార్యదర్శి గూదే శ్రీశైలం కురుమ, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలి : మిర్జాలగూడా వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

- వాస్తవాలు తెలుసుకోకుండా అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్న ఎమ్మెల్యే వ్యవహారం విడ్డూరం...
-అక్రమార్కులతో కుమ్మక్కైన కార్పొరేటర్ ని కాపాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి...
- ఉన్నత న్యాయస్థానాన్ని తప్పుద్రోవ పట్టించిన స్థానిక బిఆర్ఎస్ నాయకులు : మిర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ చిన్మయ మార్గ్





**మల్కాజిగిరిబీమార్చి 26**

**ప్రజా అక్షరం న్యూస్**

అసెంబ్లీ సమావేశాలలో బ్లాక్ మేలర్లు అంటూ తమపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తమకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలంటూ బుధవారం మల్కాజిగిరి నియోజకవర్గం, గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మిర్జాలగూడ లోని మిర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు చిన్మయ మార్గ్, వెంకటాద్రి నగర్ అసోసియేషన్ ప్రతినిధులు కాలనీవాసులతో కలిసి మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మిర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు, సంయుక్త కార్యదర్శి జంగాల శ్రీరామ్ యాదవ్ మాట్లాడుతూ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మంగళవారం తెలంగాణ శాసనసభ సభలో మిర్జాలగూడ కాలనీ వాసులు కొంతమంది బ్లాక్ మెయిల్ లకు పాల్పడుతున్నారని చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు.ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మల్కాజిగిరి కి వచ్చి కొద్ది కాలమే అవుతుందని, గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని చిన్మయ మార్గలో జరుగుతున్న అక్రమ కట్టడాలపై కనీస అవగాహన కూడా లేకుండా మాట్లాడడం విడ్డూరం అని అన్నారు. స్థానిక కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్, వారి భర్త మేకల రాము యాదవ్ లంచాలు తీసుకుంటూ చిన్మయ మార్గ్ లో రోడ్లు ఆక్రమించి అక్రమంగా కట్టడాలు జరుపుతున్న వారికి వత్తాసు పలుకుతూ, ఏదేచ్ఛగా రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు జరిపించడంలో కీలక భూమిక పోషించింది కార్పొరేటర్ భర్త మేకల రాము యాదవ్ అని తెలిపారు. సదరు విషయాన్ని ఉన్నత న్యాయస్థానానికి, జిహెచ్ఎంసి ఉన్నతాధికారుల దృష్టికి 2021 సంవత్సరంలో కాలనీవాసులు తీసుకెళ్లడంతో, న్యాయస్థానం అక్రమ కట్టడాలను కూల్చాలంటూ తీర్పునివ్వడం జరిగిందని, దానికి గాను అప్పటి జిహెచ్ఎంసి కమిషనర్ లోకేష్ కుమార్ సదరు కట్టడాల పర్మిషన్లను రద్దు చేస్తూ రేవోక్ చేపట్టారని తెలిపారు. ఇంత జరిగినా స్థానిక బిఆర్ఎస్ నాయకుడు, మల్కాజిగిరి జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ రాజు, అటు జిహెచ్ఎంసి ఉన్నత అధికారులను, ఇటు న్యాయస్థానాన్ని కూల్చివేతలు చేపట్టామని తప్పుదోవ పట్టించారు. ఈ విషయాలు ఏమీ తెలియకుండా నూతనంగా ఎమ్మెల్యే అయినా మర్రి రాజశేఖర్ రెడ్డి కాలనీ వాసులను సంప్రదించకుండా, స్థానిక కార్పొరేటర్ అక్రమ నిర్మాణదారులను వెంటబెట్టుకొని ఎమ్మెల్యేని తప్పు ద్రోవ పట్టించడంతో హైడ్రాను సంప్రదించారని అన్నారు. 2025 జనవరి నెలలో అక్రమ నిర్మాణం చేపడుతున్న వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించి గతంలో తమ నిర్మాణాలకు జిహెచ్ఎంసి అడ్డు పడిందని, ఇప్పుడు హైడ్రా అధికారులు తమని వేధిస్తున్నారని సదరు విషయాన్ని కోర్టుకు తెలియజేయడంతో, ఉన్నత న్యాయస్థానం 2021 లో కోర్టు తీర్పుని ప్రస్తుతం వచ్చిన అర్జీని పరిశీలించి అక్రమ నిర్మాణాలపై ఆరు వారల్లోగా చర్యలు తీసుకోవాలని హైడ్రాకు తెలిపినట్టు కాలనీవాసులు వెల్లడించారు. ఇది ఇలా కొనసాగుతుంటే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఈ విషయాలు ఏమీ తెలియకుండా తమను బ్లాక్ మేలర్లు అనడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని, తక్షణమే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బహిరంగంగా కాలనీవాసులకు క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో సదరు విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. శోభారాణి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు అంటే ప్రజలకు బాగు చేయాలి కానీ ఇలా అక్రమంగా నిర్మాణలు జరుపుతున్న వారికి అండగా నిలవడం ఏంటని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించారు. వర్షాలు పడుతున్నప్పుడల్లా ఎగువ ప్రాంతం నుంచి వచ్చే మురుగు నీరు, బురదతో తమ కాలనీ వాసుల జీవితాలు అస్తవ్యస్తమవుతోందని, కాలనీలో అందరూ రోగాల బారిన పడుతున్నారని, కాలనీలో నీటి సమస్య ఏర్పడి ట్యాంకర్ బుక్ చేసుకున్న రాని పరిస్థితి అని, అత్యవసర పరిస్థితిలో అంబులెన్స్, అగ్ని మపిక వాహనం కూడా రాలేని పరిస్థితిని నెలకొల్పారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ కాలనీవాసులు బయటకు వెళ్లడానికి అద్దెకు కార్ బుక్ చేసుకున్న ఎవరు తమ కాలనీకి రావట్లేదని, ఇలాంటి పరిస్థితికి కారణం కొంతమంది రోడ్లు ఆక్రమించి అక్రమ నిర్మాణాలు జరపడం, అలాంటి వారిని అడ్డుకోవడం పోయి స్థానిక కార్పొరేటర్ వారి భర్త వారికి అండగా నిలవడం ఏంటని, అలాంటి వారికి కార్పొరేటర్ మద్దతుగా ఉండడం ఎక్కడ న్యాయం చెప్పాలో అని అన్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని చిన్మయ మార్గలో జరుగుతున్న అక్రమ కట్టడాలను తానే దగ్గర ఉండి కూల్చివేతలు జరపాలని, లేనిపక్షంలో తమ కాలనీ కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని కాలనీవాసులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మిర్జాలగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణ రెడ్డి, సంయుక్త కార్యదర్శి శ్రీరామ్ యాదవ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ శోభారాణి, జాయింట్ సెక్రెటరీ బాలోజీ నాయక్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాస్, వెంకటాద్రి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు విజయ్ కుమార్ దేవరాజ్ రవీందర్ తో పాటు రెండు కాలనీలా ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై క్రైస్తవ సంఘాల ఆందోళన

### సిబిఐ విచారణ చేయాలంటూ మల్కాజిగిరిలో నిరసన -క్రైస్తవ (ఎన్ సి సి) సభ్యులు

**:మల్కాజిగిరి బీమార్చి 26**

**ప్రజా అక్షరం న్యూస్**

పాస్టర్ పగడాల ప్రవీణ్‌కుమార్ మృతిపై క్రైస్తవ సంఘాలు బుధవారం ఆందోళన చేపట్టాయి. సిబిఐ విచారణ చేయాలంటూ మల్కాజిగిరి కూడలిలో బుధవారం క్రైస్తవ సోదరులు నిరసన వ్యక్తం చేశారు. ప్రవీణ్‌కుమార్ మృతిపై అనుమానాలు ఉన్నాయంటూ క్రైస్తవ సంఘాల నేతలు ఆందోళన చేపట్టారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం శివారు కొంతమూరు వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన ఘటనలో పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతి చెందారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్‌పై సోమవారం రాజమహేంద్రవరం బయలుదేరిన ప్రవీణ్‌కుమార్ అర్ధరాత్రి సమయంలో కొంతమూరు వద్ద ప్రమాదానికి గురయ్యారు. రహదారి పైనుంచి దిగువకు ప్రమాదవశాత్తు జారిపోయారని, వాహనం అతనిపై పడిపోవడంతో బలమైన గాయాలై ఈ ఘటన చోటుచేసుకుందని పోలీసులు చెప్పారని జేఏసీ నేత బెజవాడ రవికుమార్ వెల్లడించారు. అయితే ఆయన మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయన్నారు. ఆయనకు చాలా బెదిరింపు కాల్స్ వచ్చాయని, ఆయనను టార్గెట్ చేసి చంపారని ఆరోపించారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ మృతిపై సిబిఐ విచారణ జరిపించాలని ఎన్ సీసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి బిషప్ డాక్టర్ బక్క ఏలియా డిమాండ్ చేశారు. మతోన్మాదులు ఈ దారుణానికి ఒడిగట్టారని, ఈ ఘటన పై ప్రభుత్వం కళ్ళు తెరవాలని కోరారు. పాస్టర్ ప్రవీణ్‌కుమార్ కుటుంబానికి నాయయం చేయాలన్నారు. ప్రభుత్వాలు, కోర్టులు ఇలాంటి ఘటనలు పునరావృతంకాకుండా చూడాలని వసంత్ విజ్ఞప్తి చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో ఆయా క్రైస్తవ సంఘాల పాస్టర్లు, నాయకులు.బొమ్మకంటి ప్రదీప్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# నియోజకవర్గ స్థాయి లో ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి పనులపై భహిరంగ చర్చకు సిద్ధమా..?

## కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరిన బీఆర్ ఎస్ నేతలు

**మల్కాజిగిరి బీమార్చి 26**

**ప్రజా అక్షరం న్యూస్**

మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సాధించిన అభివృద్ధి పై బుధవారం అనంద్ బాగ్ లోని బృందావన్ గార్డెన్లలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జె ఏ సి వెంకన్న బీఆర్ ఎస్ నేతలు మాట్లాడుతూ (2023-2025) ప్రధాన అభివృద్ధి పనులు ఆర్.కే పురం ఫ్లై ఓవర్ ( ఆర్ ఓ బి) నిర్మాణం కొరకు 210 కోట్లు ఆర్.కే.పురం (ఆర్ యు బి) నిర్మాణం కొరకు 35 కోట్లు జి.హెచ్.ఏం.సి ద్వార సాధరణ పనుల కొరకు 13 కోట్లు ఎస్ ఎన్ డి పి ద్వార నేరేడు మెట్ డివిజన్ యప్రాల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణం కొరకు 6 కోట్లు మౌలాలి డివిజన్ ఆర్.టీ.సి.కాలనీలో బాక్స్ డ్రైన్ నిర్మాణం కొరకు 1.7కోట్లు రైల్ అండర్ పాస్( ఆర్ యు బి) ప్రాజెక్టులు వాజపేయి నగర్ ఆర్.యు.బి. నిర్మాణం కొరకు 72 కోట్లు గౌతమ్ నగర్ ఆర్.యు.బి. కొరకు 28 కోట్లు( త్వరలో పనులు ప్రారంభం) తుర్కపల్లి ఆర్.యు.బి. నిర్మాణం కొరకు 8 కోట్లు (త్వరలో పనులు ప్రారంభం ) అల్వాల్ జనప్రియ అప్పార్ట్మెంట్ వద్ద ఆర్.యు.బి. నిర్మాణం కొరకు 8 కోట్లు రైల్వే ఆర్.యు.బి. / ఆర్.ఓ.బి ల నిర్మాణం చేసి ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తీర్చాలనే దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే విశేష కృషి చేస్తున్నారు. విద్యుత్ శాఖ ( టి జి ఎస్ సి పి డి సి ఎల్) సంబంధించిన అభివృద్ధి పనులు విద్యుత్ పరమైన సమస్యల పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేసి ఎమ్మెల్యే సాధించిన ఘనత 9.74 కోట్ల మంజూరు . మల్కాజిగిరి నియోజకవర్గ వ్యాప్తంగా సింగిల్ ఫేస్ నుండి త్రీ ఫేస్ లైన్లకు మార్పు . అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ల సామర్థ్యం పెంపు మరియు కొత్తగా 118 ట్రాన్స్ఫార్మర్ ల ఏర్పాటు. ఇంటర్ లింక్ ఫెడర్ల ఏర్పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం : ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణం కోసం సైనిక్ పురి లోని పోలీసే కమీషనర్ కార్యాలయం వెనకాల 500 గజాల ప్రభుత్వ భూమిని మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే దే అల్వాల్ ప్రాంతంలో హెల్త్ సెంటర్ ఇదివరకే ప్రారంభం అయ్యింది. డిగ్రీ కాలేజీ డిగ్రీ కాలేజీ కోసం ,నేరేడు మెట్ వాజపేయి నగర్ లోని పాత కోర్టు భవనంలో ఏర్పాటు చేయడం కోసం జిల్లా కోర్టు భవనానికి అదనంగా నిధులు ఇదివరకే మంజూరైన కోర్టు భవన



నిర్మాణంలో నిధులు సరిపోకపోవడంతో జాప్యం జరుగుతుందని అదనంగా మరో 46 కోట్ల ను మంజూరు చేయించిన ఘనత ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిదే ఫైర్ స్టేషన్ అల్వాల్ ప్రాంతంలో ఫైర్ స్టేషన్ నిర్మాణం కోసం 11 గుంటల ప్రభుత్వ స్థలాన్ని మంజూరు చేయించిన ఎమ్మెల్యే. ( ఏదైనా ప్రమాదం జరిగితే ఇతర ప్రాంతాలను నుండి ఫైర్ స్టేషన్ ఇబ్బంది సిబ్బంది వచ్చే వరకు పూర్తిగా నష్టం జరిగిన సంఘటనలు అల్వాల్ ప్రాంత ప్రజలు చూశారు, ఎమ్మెల్యే చొరవతో ఇప్పుడు అల్వాల్ లోనే ఫైర్ స్టేషన్ నిర్మాణం జరుగుతుంది. ఇది కేవలం ఎమ్మెల్యే సాధించిన ఘనత) ఇంకా ఎన్నో పనులకు సంబంధించి త్వరలోనే అధికారికంగా మంజూరు కావడం జరుగుతుంది. అదే విధంగా ప్రభుత్వం ప్రకటించిన వక్ఫ్ భూముల రిజిస్ట్రేషన్ నిలిపివేత అంశంలో పేదలకు అన్యాయం జరగకుండా చూడాలనే గట్టి సంకల్పంతో ప్రభుత్వం పై ఒత్తిడి చేసి శాసనసభలో కూడా ప్రస్తావించడంతో సంబంధిత మంత్రి సానుకూల ప్రకటన చేయడం ఎమ్మెల్యే సాధించిన మరో ఘనత, హైడ్రాబాద్ ప్రజలను అతలాకుతలం చేసిన హైడ్రా పై యుద్ధం ప్రకటించి భయభ్రాంతులకు గురవుతున్న ప్రజల పక్షాన నిలబడి, అవసరమైతే సుప్రీం కోర్టులో కూడా న్యాయ పరంగా సొంత నిధులతో ప్రజల కోసం పోరాటం చేస్తానని ప్రజలకు భరోసానిచ్చారు. ఈ సమావేశంలో కోర్పొరేటర్ మేకల సునీత మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దం పర్శురాంరెడ్డి,మేకల రాము యాదవ్ తగితరులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ శిక్త పట్నాయక్

**నారాయణపేట,మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి )**



జిల్లా కేంద్రంలో 2025 ఏప్రిల్ 20 నుంచి 2025 ఏప్రిల్ 26 వరకు జరగబోయే సార్వత్రిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. బుధవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి తగు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్ ఎస్ సి కి సంబంధించి మూడు సెంటర్లలో 600 మంది విద్యార్థులు, అలాగే ఇంటర్మీడియట్ ఐదు సెంటర్లలో 990 విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారని తెలిపారు. ఆయా పరీక్షల పూర్తి ఏర్పాటును జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. అధికారులు అందరూ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ... పరీక్షలలో సెంటర్ల దగ్గర పూర్తి స్థాయి బందోబస్తు నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమములో లైన్ డిపార్ట్మెంట్ జిల్లా అధికారులు, డి ఎస్ పి నల్లపు లింగయ్య ,జిల్లా విద్యాశాఖ టాస్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ , డి ఏం హెచ్ ఓ సౌభాగ్య లక్ష్మి, డి ఐ ఒ సుదర్శన్ రావు, పోస్ట్ ఆఫీస్ సూపర్ఇండెంట్ , డి పి ఓ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ పార్టీని పంపిణీ చేసిన గ్రామ కార్యదర్శి మహేష్

**నారాయణపేట, మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి )**

వేసవిలో ఎండల తీవ్రత అధికంగా ఉండడం కారణంగా ఉపాధి హామీ కూలీలుగా పనిచేస్తున్న కృష్ణ మండల పరిధిలోని హిందూపూర్ గ్రామం ఉపాధి కూలీలకు ఆ గ్రామ కార్యదర్శి మహేష్ ప్రభుత్వ ఆదేశానుసారంగా మంగళవారం వారికి ఓఆర్ఎస్ పాకెట్లను పంపిణీ చేశారు. కార్యదర్శి మహేష్ సూచనల మేరకు ఫీల్డ్ లక్ష్మణ ఆధ్వర్యంలో స్థానిక గ్రామీణ వైద్యుల సహకారంతో ఓ ఆర్ ఎస్ పాకెట్లను పంపిణీ చేయడం జరిగింది. తీవ్రమైన ఎండలో తమకు ఓఆర్ఎస్ పార్టీని పంపిణీ చేసిన కార్యదర్శి మహేష్ ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణులను ఉపాధి హామీ కూలీలు ధన్యవాదాలు తెలిపారు.



# ప్రజల మధ్య వైశాల్యాలు పెంచి ప్రజా సమస్యలు మరచిన కేంద్ర ప్రభుత్వం

## ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**రామన్నపేట మార్చి 26**

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి మతం పేరుతో ప్రజల మధ్య వైశ్యామ్యాలు సృష్టిస్తూ ప్రజల్లో విభజన తెచ్చి ప్రజా సమస్యలపై పోరాడకుండా కుట్ర చేస్తుందని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. సిపిఎం రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో మండల సమగ్ర అభివృద్ధి- ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజా చైతన్య పాదయాత్ర మంగళవారం రాత్రి మునిపంపుల గ్రామానికి చేరుకున్న సందర్భంగా జరిగిన బహిరంగ సభకు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తన వ్యక్తిగత ఎజెండా అయినా మతోన్మాదాన్ని పెంచి పోషిస్తూ ప్రజా సమస్యల్ని గాలికి వదిలేసిందన్నారు డీలిమిటేషన్ లో భాగంగా దక్షిణాది రాష్ట్రాల్లో పార్లమెంటుల్లో ప్రాతినిధ్యాన్ని తగ్గించి బిజెపి ఇతర రాష్ట్ర ప్రజల్ని మోసం చేస్తుందన్నారు. కేంద్రం నుండి గ్రామాలకు రావాల్సిన అభివృద్ధిని నిధులు రోడ్లు పథకాలు చేరడం లేదని ఉపాధి హామీ పథకం నిధులను పక్కదారి పట్టించి నిర్వీర్యం చేస్తుందన్నారు. అంబానీ,ఆదాని లాంటి కార్పొరేట్ శక్తులకు లోపాయకారంగా ఊడిగం చేస్తూ దేశాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదల సమస్యల పరిష్కరించడంలో పాలకులు చొరవ చూపడం లేదు క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యల్ని అధ్యయనం చేసి ప్రజల బాధలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సిపిఎం ప్రజా చైతన్య పాదయాత్ర నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దాకా పోరాటం ఆగదు ఎండి జహంగీర్ జిల్లా కార్యదర్శి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దాకా సిపిఎం పోరాటం ఆగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం డి జహంగీర్ అన్నారు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కినంక హామీలను మరచి ప్రజలను




మోసం చేస్తుందన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలు అమలు చేయడంలో చోద్యం చేస్తుందని దరఖాస్తుల పేరుతో కాలయాపన చేస్తుందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి, పాదయాత్ర బృందం సారథి జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్,కందుల హనుమంతు, గౌరిగి సోములు, బొడిగె రజిత, వేముల సైదులు, కొమ్ము అంజమ్మ,మేడి గణేష్, శానకొండ రామచంద్రం, వనం ఉపేందర్,బల్గూరి అంజయ్య, కల్లూరి నాగేష్, మండల కమిటీ సభ్యులు తొలుపునూరి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి నోముల రమేష్, తాళ్లపల్లి జితేందర్,తొలుపునూరి చంద్రశేఖర్, గంటెపాక శివకుమార్,జోగుల శ్రీనివాస్, బూడిద బిక్షం, మేడి బాషయ్య,యాదాసు నరసింహ,పులిపలుపుల నాగార్జున,అప్పం సురేందర్,హేమలత, ధనమ్మ,శారద తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ మోటివేషన్ స్పీకర్ ట్రైనర్ గా సర్టిఫికెట్ అందుకున్న మీసాల రాజయ్య...

**యాదగిరిగుట్ట రూరల్**

సికింద్రాబాద్ హెరీటల్ మినేర్వా గ్రాండ్ లో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ తెలంగాణ రాష్ట్రానికి చెందిన వ్యక్తుల నైపుణ్యతకు సంబంధించి రెండు రోజుల కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండర్ గంప నాగేశ్వరరావు ప్రెసిడెంట్ రామచంద్రుడు వైస్ ప్రెసిడెంట్ మాధవి సినిమా యాక్టర్ ప్రదీప్ పాల్గొనడం జరిగింది. ఇందులో యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని చొల్లేరు గ్రామానికి చెందిన మీసాల రాజయ్య మోటకొండూరు మండలంలో సెయింట్ పీటర్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు అద్భుతంగా ప్రతిభ కనబరిచిన ఆయనకు యాక్టర్ ప్రదీప్ కుమార్ గంప నాగేశ్వరరావు చేతుల మీదుగా మోటివేషనల్ స్పీకర్ ట్రైనర్ గా ప్రశంస పత్రం అందించారు. ఈ సందర్భంగా రాజయ్యని ప్రశంసిస్తూ ఆయన యొక్క సేవలు విద్యార్థులకు సమాజానికి చాలా అవసరం అని అదేవిధంగా తన నైపుణ్యం ద్వారా సమాజంలో అవగాహన పెంచాలని చెప్పారు. రాజయ్య యొక్క ప్రతిభ వల్ల ఆ ట్రైనింగ్ లో ఆయనకు మొదటి స్థానం రావడం గర్వకారణమని అభినందించారు.




# ఘనంగా ధర్మ బిక్షం 14 వర్ధంతి వేడుకలు.....

## కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల) సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం యాదాద్రి జిల్లా అధ్యక్షులు

**రామన్నపేట మార్చి 26**


గీతపనివారల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, గౌడజాతికి తన జీవిత కాలాన్నే అంకితం చేసిన బొమ్మగాని ధర్మబిక్షం 14వ వర్ధంతిని రామన్నపేట మండల గౌడసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించామని సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం ఆల్ ఇండియా ప్రెసిడెంట్ కప్పల రవికుమార్ గౌడ్ (పరిటాల) (యాదాద్రి జిల్లా అధ్యక్షులు) గీతపనివారల సంఘం రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎర్ర రమేష్ గౌడ్, గౌడ్,గీతపనివారల మండల అధ్యక్షులు గంగాపురం వెంకటయ్య తెలిపారు, ..ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2011 మార్చి 26న ధర్రబిక్షం మరణించారని 14సంవత్సరాలు గడిచినా కూడా వారు కళ్ళ ముందు ఉన్నట్టే ఉందని, ఇంకా 400 సంవత్సరాలైనా గౌడజాతి ధర్మబిక్షం ని, వారి చేసిన త్యాగాన్ని, వారి గౌడులకు చేసిన సేవలను, చేసిన చట్టాలను మర్చిపోదని వారు అన్నారు..1957 లో గీతపనివారల సంఘం ఏర్పాటు చేసి గీతపనివారల సమస్యలపై అలుపులేని పోరాటాలు చేసారని, 50ఏండ్లకే ఫించను, ప్రతీ సొసైటీకి 5ఎకరాల భూమిని తాటిచెట్లపెంపకానికి ఇవ్వాలనే చట్టాన్ని, ప్రమాదవశాత్తు తాటిచెట్టు ఎక్కి పడిపోతె వికలాంగులైనా, చనిపోయినా ఎక్స గ్రేషియో ఇవ్వాలని ఆరోజుల్లోనే ప్రభుత్వాలతో కొట్లాడి సాధించారని తెలియజేసారు...వారు కొట్లాడి తెచ్చిన చట్టాలలో ప్రతీ సొసైటీకి 5ఎకరాల భూమి పూర్తిగా అమలు కాలేదని, కాంగ్రేస్ ప్రభుత్వం అమలు చేసి ప్రతీ సొసైటీకి 5ఎకరాల భూమిని తాటిచెట్ల,ఈతచెట్ల వనం పెంపకానికి ఇవ్వాలని, కాలయాపన చేసే మెడికల్ బోర్డును ఎత్తివేయాలని,మోటారు వెహికల్స్ ప్రతీ గీతవృత్తి దారులకు ఇవ్వాలని అన్నారు..వర్ధంతి వేడుకలలో గీతపనివారల సీనియర్ నాయకులు బాలగోని మల్లయ్య, సొసైటీ అధ్యక్షులు ఎర్ర వెంకటేష్, బత్తుల సత్తయ్య, బోయపల్లి మల్లేషం, వీరమళ్ళ ముత్తయ్య, భూపతి నర్సింహ్మ, బాలగోని గణేష్, గోపగోని మల్లయ్య, బాలగోని స్వామి, నోముల వెంకటేష్, ఆకిటి స్వామి, వీరమళ్ళ నర్సింహ్మ, చెరుకు శివరాజ్, నర్సింహ్మ తదితరులు పాల్గొన్నారు



# ధర్మ బిక్షం గౌడ్ ఆశయాలు సాదిస్తాం గౌడ సంఘము అధ్యక్షులు పంజాల నర్సయ్య గౌడ్

**మార్చ్ 26 ఆత్మకూరు ప్రజా అక్షరం ప్రతినిధి**

ఆత్మకూరు మండల కేంద్రం లో గౌడ పితామహుడు, బడుగు, బలహీన వర్గాల, బహుజనుల ఆశాజ్యోతి, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మబిక్షం 14వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ధర్మబిక్షం విగ్రహానికి ఆత్మకూరు ఎం గ్రామ గౌడ సంఘం సొసైటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో గౌడ సంఘము మండల అధ్యక్షులు రంగ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు గడ్డం దశరథ ,నారాయణ, వెంకన్న. శంకర్. నర్సయ్య, మనిదీప్, ఐలయ్య, మల్లేశం,జహంగీర్,విష్ణు, రాంబాబు,సిద్ధులు, అబ్బసాయిలు, స్వామి,శ్రీను, శేఖర్,నరేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు



# సాంబశివుని మృతి బాధాకరం 14వ వర్ధంతి సభలో మాజీ ఎమ్మెల్యే పైళ్ల

**వలిగొండ మార్చ్ 26 ప్రజా అక్షరం ప్రతినిధి**

బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాంబశివుని మృతి ఎంతో బాధాకరమని భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం వలిగొండ మండలం దాసిరెడ్డిగూడెం గ్రామంలో నిర్వహించిన సాంబశివుని 14వ వర్ధంతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా మాట్లాడుతూ సాంబశివుడు తన జీవితం ప్రజల కోసం దార పోసిన గొప్ప వ్యక్తిని ఆయన కొనియాడారు. అదే విధంగా ఇంకా ప్రజాసేవ చేయాలన్న దృఢ సంకల్పం సాంబశివునికి ఎంతో ఉండేదని కానీ దురదృష్టవశాత్తు ఆయన మాఫియా ముఠా చే హత్యగావించడం అత్యంత బాధాకరమని ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలని శేఖర్ రెడ్డి కోరారు ఈ సందర్భంగా సాంబశివుని విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు ఇంకా ఈ కార్యక్రమంలో పాల్గొన్న బి ఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి నాయకులు దూదిమెట్ల బాలరాజు యాదవ్, పైల రాజ వర్ధన్ రెడ్డి, మొగుళ్ళ శ్రీనివాస్ గౌడ్, ఆయన జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకటరెడ్డి, మాజీ మార్కెట్ చైర్మన్ కూనపురి కవిత, నాయకులు కొమురెల్లి సంజీవరెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి, పడమటి మమతా నరేందర్ రెడ్డి, గూడూరు సంధ్య శేఖర్ రెడ్డి,ఇంకా పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.



## ఢిల్లీలో ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జి మీనాక్షి నటరాజన్ ను కలిసిన డీసీసీ అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి

**నారాయణపేట, మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి )**

ఢిల్లీలో ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ ని బుధవారం వన్ టూ వన్ సమావేశ కలిసి మాట్లాడిన నారాయణపేట జిల్లా డిసిసి అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా తీసుకుపోవాలని,కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న స్కీములన్ని ప్రజలకు అందజేయాలని ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ పేర్కొన్నారని ప్రశాంత్ రెడ్డి తెలిపారు. నారాయణపేట జిల్లాలో రాబోయే లోకల్ బాడీ ఎలక్షన్లో ఖచ్చితంగా కాంగ్రెస్ పార్టీని నూటికి నూరు శాతం గెలిపించాలని తెలిపినట్లు ఆయన చెప్పారు. ముఖ్యంగా నారాయణపేట జిల్లాలో ఎవరైతే 10 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు సరైన గుర్తింపు దక్కేలా చూడాలని ప్రశాంత్ రెడ్డి ఏఐసీసీ తెలంగాణ ఇన్చార్జ్ మీనాక్షి నటరాజన్ తో కోరినట్లు తెలిపారు. మీనాక్షి నటరాజ్యాలను కలిసిన వారిలో పలువురు డిసిసి అధ్యక్షులు ఉన్నట్లు ప్రశాంత్ కుమార్ రెడ్డి తెలిపారు.



## పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు

### రూ.50 వేలు నష్టపరిహారం చెల్లించాలి..

### -దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్..

**దేవరకద్ర, మార్చి 26 (ప్రజా అక్షరం న్యూస్)**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం లో పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ50 వేలు చొప్పున నష్టపరిహారాన్ని వెంటనే చెల్లించాలని దేవరకద్ర నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి డిమాండ్ చేశారు. భూత్పూర్ మండల కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడారు. భూగర్భ జలాలు తగ్గిపోవడంతో పంటలు దాదాపుగా ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. ఇది ఇలా ఉండగా ఇటీవల కురిసిన వడగండ్ల వానకు కూడా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని మాజీ ఎమ్మెల్యే ఆలా ఆవేదన వ్యక్తపరిచారు. రైతుబంధు రాక, రుణమాఫీ కాకా రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. కావున దేవరకద్ర నియోజకవర్గం లో వెంటనే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంట నష్టపోయిన వివరాలను వెంటనే ప్రభుత్వానికి నివేదిక రూపంలో అందజేయాలని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు.



## ధర్మ బిక్షం గౌడ్ ఆశయాలు సాదిస్తాం గౌడ సంఘము అధ్యక్షులు పంజాల నర్సయ్య గౌడ్

**మార్చ్ 26 ఆత్మకూరు ప్రజా అక్షరం ప్రతినిధి**

ఆత్మకూరు మండల కేంద్రం లో గౌడ పితామహుడు, బడుగు, బలహీన వర్గాల, బహుజనుల ఆశాజ్యోతి, మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మబిక్షం 14వ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ధర్మబిక్షం విగ్రహానికి ఆత్మకూరు ఎం గ్రామ గౌడ సంఘం సొసైటీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో గౌడ సంఘము మండల అధ్యక్షులు రంగ సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులు గడ్డం దశరథ ,నారాయణ, వెంకన్న. శంకర్. నర్సయ్య, మనిదీప్, ఐలయ్య, మల్లేశం,జహంగీర్,విష్ణు, రాంబాబు,సిద్ధులు, అబ్బసాయిలు, స్వామి,శ్రీను, శేఖర్,నరేష్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు



## బొమ్మకూరు డ్యాం నుండి తపస్పల్లి డ్యాంకు కు నీళ్లు విడుదల.

### వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్లనగుల శ్వేతా వెంకన్న..

**బచ్చన్నపేట మార్చి 26 ప్రజా అక్షరం ప్రతినిధి**



బచ్చన్నపేట , చేర్యాల కొమరవెల్లి ,మండలంలో పలు గ్రామాల చెరువులలో నీళ్లు లేక పంట పొలాలు ఎండుతున్నాయని వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా వెంకన్న జనగామ డిసిసి అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గారికి తెలియజేయడంతో వారు మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి తో మాట్లాడి దేవాదుల ప్రాజెక్టు ద్వారా జనగామ నియోజకవర్గం ప్రాంతానికి నీళ్లు అందించడానికి బొమ్మకూరు డ్యామ్ కు నీటిని విడుదల చేయాలని గత కొన్ని రోజులుగా నీటిపారుదల శాఖ ఈ ఈ, ఏఈలకు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి గారికి తెలియజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ నల్ల నాగుల శ్వేతా వెంకన్న మాట్లాడుతూ జనగామ అభివృద్ధి ప్రదాత డిసిసి అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి గారు మంత్రులతో మాట్లాడి నీటిని తపస్పల్లి డ్యామ్ కు పంపింగ్ , నీళ్లు విడుదల చేయడం జరిగింది అని (పంపింగ్ మొదలైందని) తెలియజేశారు. ఈ సందర్భంగా బచ్చన్నపేట మండల అధ్యక్షుడు నూకల బాల్రెడ్డి,,జంగిటి విద్యనాథ్,అల్వాల ఎల్లయ్య, పెద్దపాటి కరుణకర్ రెడ్డి,తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

# గర్భిణీ స్త్రీలు పౌష్టిక ఆహారాలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ హనుమంతు రావు

**తుర్కపల్లి మార్చి 25**

**ప్రజా అక్షరం న్యూస్**

గర్భిణీ స్త్రీలు డాక్టర్ల సలహాలు, సూచనలు పాటించి ఆరోగ్యానికి కాపాడుకోవడానికి ప్రతిరోజూ పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హనుమంతు రావు గర్భిణీ స్త్రీలకు బుధవారం తుర్కపల్లి మండలంలోని రామోజీనాయక్ తండా లో గర్భిణి అఖిల,ఇంటిని సందర్శించి,అమ్మకు భరోసా ఇచ్చారు.అఖిల ఆరోగ్యం ఎలా ఉంది అంటూ ఆరా తీశారు.సమయానికి భోజనం చేస్తున్నవా అంటూ ఆప్యాయంగా పలకరించారు.సమయానికి మందులు వేసుకోవాలని సూచించారు.ఈ సమయంలో జాగ్రతగా ఉండాలని సూచించారు.నీవు మంచి ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,..కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఇలాంటి సమయంలో ఎలాంటి టెన్షన్స్ లేకుండా ఉండాలని సూచించారున్యూట్రిషన్ కిట్ ని అపర్ణ కి అందజేశారు.ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవాలు ఆరోగ్యదాయకం,లాభదాయకం పైసా ఖర్చు లేకుండా,ప్రభుత్వ ఆసుపత్రి కి తీసుకరావటం దగ్గర ఉండి కాన్పు చేయడమే కాకుండా తల్లి బిడ్డలకు సరిపడా మందులు , బిడ్డకు వాక్సిన్లు ఇవ్వడమే కాకుండా తల్లి బిడ్డని 102 వాహనం ద్వారా ఇంటిదగ్గర దింపే సదుపాయం ఉందని అధికారులు తెలిపారు.హిమోగ్లోబిన్ పెంచే ఆహారం పదార్థాలు,ఆకుకూరలు, మెంతి,తోటకూర,పుంటికూర,పప్పు తో ఆకుకూర కనీసం వారానికి రెండుసార్లు తీసుకోవాలని అన్నారు.గ్లాస్ పాలు కొంచెం కొబ్బరి ముక్క,ఎండినది,పచ్చిది లాంటివి,పల్లీలు బెల్లంతో కలిపి,ఖర్జూర , డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు.మరీ తక్కువగా ఉంటే తప్పనిసరిగా అయితే ఐరన్ ట్యాబ్లెట్స్ లేదా ఇంజక్షన్ రూపంలో డాక్టర్ పర్యవేక్షణలో సూచనమేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.దీనితో ఇమ్యూనిటి పెరిగి మానసిక శరీర ఎదుగుదల ఉంటాయి.కాన్పు తర్వాత గంటలోపు ఇవాల్సిన ముర్రు పాలు ప్రాముఖ్యత గురుంచి అవగాహన కల్పించారు.ప్రతి నెలలో ఒకరోజు జిల్లా



వ్యాప్తంగా అమ్మకు భరోసా జరుగుతుందని తెలిపారు.ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రసవాలు జరిగేలా చూడడం,తద్వారా డబ్బు ఖర్చుకాకుండా నాణ్యమైన వైద్యసేవలు అందించడమే కాకుండా తల్లి బిడ్డల ఆరోగ్యం పదిలంగా ఉండాలని కోరారు. సాధారణ కాన్పులు అయేలా చూడాలని డాక్టర్లను ఆదేశించారు. గృహ సందర్శనాలు చేయాల్సిన అంగన్వాడీ టీచర్,ఆశాలు , ఏ ఎన్ ఎం లు తరుచుగా గర్భిణీ స్త్రీల ఇండ్లను సందర్శించాలని ఆదేశించారు. గర్భిణీ స్త్రీలపై ఆరోగ్యశాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే తప్పకుండా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు, తల్లుల కమిటీ మహిళలు మహిళలు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ నేత కామ్రేడ్ ధర్మ బిక్షం 14వ వర్ధంతి

**మార్చి 26 మర్రిగూడెం ప్రజా అక్షరం న్యూస్ రిపోర్టర్**

**ఉద్యమ నేతకు 14 వ వర్ధంతి.**

ఉద్యమమే ఊపిరిగా పేదల కోసం అహర్నిశలు శ్రమించిన, గీతాపనివారాల సంఘం వ్యవస్థాపకులు, మాజీ పార్లమెంటు సభ్యులు కామ్రేడ్ బొమ్మగాని ధర్మభిక్షం 14వ వర్ధంతిని మర్రిగూడ మండల కేంద్రంలో నిర్వహించారు.. గీతా పనివారాల సంఘం వారి జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకలి నిరంజన్ గౌడ్ ఈ కార్యక్రమంలో పాల్గొని, వారి త్యాగాలను నెమరేసుకుంటూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొని తెలంగాణ ప్రజల కోసం పనిచేశారని ఆయన అన్నారు.. దున్నేవానికే భూమి, గీసేవానికే తాటి చెట్టు కావాలనే నినాదంతో గీత కార్మికులను ప్రజలను చైతన్యం చేసి అనేక పోరాటాలు నిర్వహించారని, ఎమ్మెల్యేగా, ఎంపీగా ఆయన ప్రజలకు ఎన్నో సేవలందించారని ఆయన అన్నారు.. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్ మాట్లాడుతూ, ధర్మ బిక్షం యువకులను విద్యార్థులను పోరాటాల వైపు వచ్చే విధంగా తీర్చిదిద్దారని, నేటి యువజన విద్యార్థులు ఆయన పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని సమాజంలో పేద మధ్యతరగతి వర్గాలకు సేవలందించారని ఆయన అన్నారు.. ఈ



కార్యక్రమంలో గీతా పనివారల సంఘం మండల నాయకులు అల్వాల్ నరసింహ, వల్లపు కేశవ గౌడ్, కర్నాటి శేఖర్, కర్నాటి అంజయ్య, శ్రీకాంత్, సిపిఐ మండల నాయకులు కొండ్రెడ్డి గిరి, జక్కల అంజయ్య తదితరులు పాల్గొన్నారు..

# ఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు

**గోదావరిఖని మార్చి 26**

**(ప్రజా అక్షరం ప్రతినిధి):-**

సీనియర్ లాయర్ ఇజ్రాయెల్పై జరిగిన కిరాతక దాడిని తీవ్రంగా ఖండిస్తూ, గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రిలే నిరాహార దీక్షకు భారతీయ జనతా పార్టీ రామగుండం ఇంచార్జ్ కందుల సంధ్యారాణి మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ "లాయర్ ఇజ్రాయెల్ " పై జరిగిన దాడి న్యాయ వ్యవస్థపై దాడి చేసినట్లే అన్నారు.ఇలాంటి ఘటనలు న్యాయ వృత్తిలో ఉన్నవారికి భద్రతపై అనేక సందేహాలను కలిగిస్తాయన్నారు. న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు అవసరం అని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకొని,న్యాయవాదుల సమాజానికి ప్రభుత్వం భరోసా కల్పించాలి" అని డిమాండ్ చేశారు.భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ బాధితుల పక్షాన ఉంటుందని, న్యాయవాదుల హక్కుల కోసం జరిగే ఏ పోరాటానికైనా సంపూర్ణ మద్దతు ఇస్తుందని వారు స్పష్టం చేశారు.వారు ప్రభుత్వాన్ని ఉద్దేశించి లాయర్ ఇజ్రాయెల్పై దాడి చేసిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలన్నారు.న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక చట్టాలు అమలు చేయాలని,వారి కుటుంబానికి తక్షణ సాయం అందించాలన్నారు.భవిష్యత్తులో ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు.ఇజ్రాయెల్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు



పోరాడతామని ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కోడూరి రమేష్, గుండబోయిన భూమయ్య నాయకులు అందె రాజుకుమార్ చారి,మామిడి వీరేశం తదితరులు పాల్గొన్నారు.

# ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ఆధ్వర్యంలో

## " పచ్చదనం పరిశుభ్రత "






**గోదావరిఖని మార్చి 26**

**(ప్రజా అక్షరం ప్రతినిధి):-**

గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ -II, యూనిట్ -III ల ఆధ్వర్యంలో ప్రభుత్వ ప్రాథమిక మండల పరిషత్ పాఠశాల, విఠల్ నగర్ లో గత మూడు రోజులుగా ఎన్ఎస్ఎస్ అండ్ స్పెషల్ క్యాంపు నిర్వహించడం జరుగుతుంది. ఈ క్యాంపులో భాగంగా మొదటి రోజున క్షయవ్యాధి-మీద అవగాహన, రెండవ రాజున ఫైర్ ఫైట్ ( ఆపత్కాల్) అవగాహన, మూడవ రోజున పాఠశాలలో పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమం -నిర్వహించడం జరిగింది. ఇంకా మిగిలిన నాలుగు రోజులలో విద్యా ప్రాధాన్యత, ఆరోగ్య ప్రాధాన్యత, పరిసరాల పరిశుభ్రత,సామాజిక రుగ్మతల గురించి ప్రజలలో -అవగాహన కల్గించడానికి విధ్యారులు వివిధ కార్యక్రమాల ద్వారా ప్రయత్నిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. జైకిషన్ ఓర్ఘూనా ఎన్ఎస్ఎస్ యూనిట్ -1ప్రోగ్రాం ఆఫీసర్ సాంబాశివరావు, ఎన్ఎస్ఎస్ యూనిట్ II ప్రోగ్రాం ఆఫీసర్ డా.నరేష్,ఎన్ఎస్ఎస్ యూనిట్ -III ప్రోగ్రాం ఆఫీసర్ డా. కిరణ్మయి, సీనియర్ అధ్యా పకులు డా. సుబ్బారావు, అధ్యాపక,అధ్యాపకేతరులు కూడా పాల్గొని విధ్యార్థులను ఉత్సాహపరుస్తూ ఆ ప్రాంత ప్రజలలో అనేక విషయాల మీద అవగాహన కల్గించడానికి ప్రయత్నిస్తున్నారు.

# రామోజీ నాయక్ తండాలో గర్భిణీ స్త్రీ ఇంటిని సందర్శించిన జిల్లా కలెక్టర్

**తుర్కపల్లి మార్చ్ 25**

**ప్రజాక్షరం న్యూస్**

తుర్కపల్లి మండలంలోని రామోజీ నాయక్ తండాలోని గర్భని శ్రీ అఖిల ఇంటిని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మకు భరోసా కార్యక్రమంలో భాగంగా తండాను సందర్శించినట్టు తెలిపారు. అఖిల ఆరోగ్యం ఎలా ఉంది అంటూ ఆరా తీశారు. సమయానికి భోజనం చేస్తున్నావా అంటూ ఆప్యాయంగా పలకరించారు .సమయానికి మందులు వేసుకోవాలని సూచించారు. ఈ సమయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నీవు మంచి ఆహారం తీసుకుంటే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి సమయంలో ఇలాంటి టెన్షన్ లేకుండా ఉండాలని సూచించారు. న్యూట్రిషన్ కుట్టును అపర్ణకు అందజేశారు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాలు ఆరోగ్యదాయకమని లాభదాయకమని అన్నారు. పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రికి పత్రికి తీసుకుపోవడం దగ్గర నుండి కాన్పు చేయడం కాకుండా తల్లి బిడ్డలను సరిపడే మందులు బిడ్డకు వ్యాక్సిన్ ఇవ్వడం మే కాకుండా తల్లి బిడ్డను 102 వాహనం ద్వారా ఇంటి దగ్గర దింపే సదుపాయం ఉందని అధికారులకు తెలిపారు. ఏమో గ్లోబెన్ను పెంచే ఆహారం తీసుకోవాలని ఆకుకూరలు పప్పుతో కూడిన ఆకుకూరలు వారానికి రెండు సార్లు తీసుకోవాలని అన్నారు. గ్లాస్ పాలు కొంచెం కొబ్బరి ముక్క తీసుకొని పల్లీలు బెల్లంతో కలిసి ఖర్జూర డ్రైఫ్రూట్స్ తీసుకోవాలని తెలిపారు. అతి తక్కువగా ఉండే తప్పనిసరిగా అయితే ఐరన్ క్యాప్సిల్స్ లేదా ఇంజక్షన్ రూపంలో డాక్టర్లు పర్యవేక్షణలో సూచన మేరకు తీసుకోవాలని తెలిపారు. దీనితో ఇమ్యూనిటీ పెరిగి మానసిక శరీర ఎదుగుదల ఉంటుందని కాన్పు తర్వాత గంటలోపు ఇవ్వాల్సిన ముర్రుపాలు ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించారు ప్రతి నెలలో ఒకరోజు జిల్లా వ్యాప్తంగా అమ్మకు భరోసా



జరుగుతుందని అన్నారు. ప్రభుత్వాసుపత్రి ప్రసవాలు జరిగే విధంగా చూడాలని తద్వారా డబ్బు ఖర్చు కాకుండా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కాకుండా తల్లి బిడ్డల సంరక్షణ పదిలంగా ఉంటుందని అన్నారు. సాధారణ కానుపులు జరిగేలా చూడాలని అన్నారు గృహ చేయాల్సిన అంగన్వాడీ టీచర్లు ఆశాలు గర్భిణీ స్త్రీల ఇండ్లను సందర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం ఎస్ ఓ మనోహర్ ,తహసిల్దార్ దేశనాయక్, పిఎస్సి డాక్టర్ డాక్టర్ రుచిరా రెడ్డి ,పల్లె పహా డాక్టర్ రాహుల్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు

# నేడు దౌల్తాబాద్ లో తై బజార్ వేలం పాట.

**దౌల్తాబాద్ మార్చి 26(ప్రజా అక్షరం )**



దౌల్తాబాద్ మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో గురువారం రోజున ఉదయం 11:30 నిమిషాలకు తైబజార్ వేలంపాట, మండల పంచాయతీ అధికారి సయ్యద్ గఫూర్ ఖాద్రి ఆధ్వర్యంలో 2025 - 26 సంవత్సరానికి బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు దౌల్తాబాద్ గ్రామపంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలో నిర్వహించే పశువుల సంత, కూరగాయల మార్కెట్ బహిరంగ వేలం పాటలో పాల్గొనేవారు పదివేల రూపాయల చొప్పున డిపాజిట్, గ్రామపంచాయతీకి ఏ విధమైన బకాయలు ఉండరాదని తెలిపారు. బహిరంగ వేలం పాటలో ఆసక్తి కలవారు పాల్గొనవచ్చని తెలిపారు.




# కొలనుపాక గౌడ సంఘం అధ్యక్షులుగా మాసాపేట రాజు గౌడ్

**ఆలేరు మార్చి 26 ప్రజా అక్షరం**

ఆలేరు మండలంలోని కొలనుపాక గీతా పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని బుధవారం ఎన్నికల అధికారి కో-ఆపరేటివ్ ఇన్స్పెక్టర్ దశరథ సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా మాసాపేట రాజు గౌడ్, ఉపాధ్యక్షులుగా కోటగిరి కృష్ణ గౌడ్, మడిపల్లి నరసింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా ఆరే అశోక్, కోశాధికారిగా దూడల సాగర్, డైరెక్టర్లుగా మిట్టపల్లి సుభాష్, భీమగోని సారయ్య, గడ్డం సందీప్, మడిపల్లి శ్రీధర్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కుల పెద్దలు బైరి పాపారాజ గౌడ్, నలవాల సోమలింగం, బైరి బిక్షపతి, బైరి ఆనందం, కుమ్మరిండ్ల సోమేశ్వర్ తదితరులు ఉన్నారు



# దశదినకర్మలు పాల్గొన్న డిసిసి ఉపాధ్యక్షులు వాకిటి

**వలిగొండ మార్చ్ 26 ప్రజా అక్షరం ప్రతినిధి**

వలిగొండ మండల పరిధిలోని సంగెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు బద్దం సంజీవరెడ్డి తండ్రి బద్దం భగవంతు రెడ్డి దశదినకర్మలో భువనగిరి జిల్లా బుధవారం పాల్గొని వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# నిరుపేద ముస్లిం కుటుంబాలకు తోఫా పంపిణీ

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**

రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని గాంధీ నగర్ లో సూఫీ ఇస్లామిక్ బోర్డు ఆధ్వర్యంలో 200 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఉచితంగా తోఫా పంపిణీ చేశారు. రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం కుటుంబాలు సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో సేమియా ప్యాకేట్లను పంపిణీ చేశారు. సూఫీ ఇస్లామిక్ బోర్డు ప్రతినిధి తాజ్ ఆయన కుమారుడు సైజాద్ స్మారకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తాజ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.అందరికీ రంజాన్ పర్వదినం ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు.



# మత్స్యాద్రి హుండీ లెక్కింపు హుండి లెక్కింపులో భారీగా 18 , 34, 671/- రూపాయల ఆదాయం

**వలిగొండ మార్చి 26 ప్రజా అక్షరం ప్రతినిధి**

వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో వెలసిన శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం రోజు దేవస్థాన హుండీలో భక్తులు సమర్పించిన కానుకల హుండీలు విప్పి లెక్కించగా 4 నెలల 10 రోజులకు కు గాను రూ. 18,34,671/-లు శ్రీస్వామి వారి బ్రహ్మోత్సవాల మరియు వార్షికోత్సవాల సందర్భంగా కళ్యాణ కట్నములు రూ. 30,380/-ఆదాయము వచ్చినట్లు దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ కొమ్మారెడ్డి నరేష్ కుమార్ రెడ్డి,కార్యనిర్వాహణాధికారి సల్వాద్రి మోహన్ బాబు తెలిపారు. ఈలెక్కింపు సహాయ కమీషనర్ , దేవాదాయ ధర్మదాయ శాఖ, నల్లగొండ వారిచే డిప్యూటీ చేయబడిన నిఖిల్ జూనియర్ అసిస్టెంట్ పర్యవేక్షణలో జరిగినది. ఈ హుండీ లెక్కింపులో దేవస్థానం ధర్మకర్తలు ఆర్. ప్రభాకర్, ఏం. వెంకటేశం, ఏ.అంజయ్య, ఏ. వెంకటేశం, కే.కరుణాకర్, కే.బాలేశ్వర్, బండి రవి, అర్చకులు మరియు సిబ్బంది, లక్ష్మీవెంకటేశ్వర సేవా ట్రస్ట్ సభ్యులు మహబూబాబాద్ వారు, భక్తులు, కెనరా బ్యాంకు మేనేజర్ సురేష్ బాబు, వీరేందర్ రెడ్డి మరియు తదితరులు పాల్గొన్నారు.



# నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తక్షణమే కూల్చివేయాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (ప్రజా అక్షరం) మార్చి 26:**

భద్రాచలం పట్టణంలో ఏజెన్సీ చట్టాలకు విరుద్ధంగా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను తక్షణమే కూల్చివేయాలని భద్రాచలం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలపై అధికారులకు అనేక సార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోగా అధికారులు లంచాలకు అలవాటు పడి, చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారని మండి పడ్డారు. ఈ రోజు భద్రాచలం పట్టణంలోని రామాలయం సమీపంలో 6 అంతస్తుల భవనం కూలిన ఘటనకు సంబంధించి సహకరించిన, బాధ్యులైన



అధికారులపై ఉన్నతాధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని జేఏసీ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు పూనెం కృష్ణ దొర, పాయం రవివర్మ, ముర్ల రమేష్ రెడ్డి, పూనెం వీరభద్రం, పూనెం నాగేశ్వరరావు,కొండ్రు సుధారాణి, చిచ్చడి సత్యనారాయణమూర్తి, కోర్స చిట్టిబాబు దొర, సోంది రవి కుమార్ మరియు నాయకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వ్యవస్థలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఎమ్మెల్యే కృషి

**మల్కాజిగిరి :మార్చి 26 ప్రజా అక్షరం న్యూస్**

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వ వ్యవస్థల పై అవగాహన కల్పించేందుకు బుధవారం శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఇందులో భాగంగా రైల్వే క్వార్టర్స్ ప్రభుత్వ పాఠశాల, మల్కాజిగిరి ప్రభుత్వ బాలికల పాఠశాల మరియు ఈరోజు మౌలాలి జెడ్.పి.హెచ్.ఎస్. స్కూల్ విద్యార్థులను సొంతంగా బస్సులను ఏర్పాటు చేసి శాసనసభ సందర్శనార్థం తీసుకెళ్లారు . ఈ సంధర్భంగా మౌలాలి డివిజన్ బి.ఆర్.ఎస్ నాయకులు విద్యార్థులకు వాటర్ బాటిల్స్ మరియు స్నాక్స్ ఏర్పాటు చేసి దగ్గరుండి బస్సులను అసెంబ్లీ కి పంపించారు.ఈ కార్యక్రమంలో భాగనంద్ రావు, ఉస్మాన్, వంశీ ముదిరాజ్, అది నారాయణ,జోగు శ్రీనివాస్ ,సంతోష్ గుప్త, సిలుముల కిరణ్, బుద్ధి నర్సింగ్ రావు, కాశీ యాదవ్, దుర్గేశ్,స్వామి, గణేష్, నాగరాజ్ తదితరులు ఉన్నారు.




# సాంబశివుడు స్తూపానికి నివాళులు అర్పించిన నకిరేకంటి సతీష్ కుమార్

## తెలంగాణ ఉద్యమకారులు

**రామన్నపేట మార్చి 26**

పీడిత తాడిత వర్గాల ఆశాజ్యోతి, బోనగిరి ముద్దుబిడ్డ, తెలంగాణ ఉద్యమకారులు, మాజీ మావోయిస్టు, టిఆర్ఎస్ పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు కున్నపురి సాంబశివుడు అలియాస్ ఐలన్న 14వ వర్ధంతి సందర్భంగా స్తూపానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించిన మలిదశ తెలంగాణ ఉద్యమ కళాకారుడు నకిరేకంటి సతీష్. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఐలన్న చేసినటువంటి పోరాటాలు, అదేవిధంగా ఆయన తెలంగాణ ఉద్యమానికి చేసినటువంటి త్యాగాలను గుర్తు చేసుకోవడం జరిగింది. అదేవిధంగా ఐలన్న పోరాట స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ముందుకెళ్తామని తెలిపారు.



# మనోవేదనతో ఆత్మహత్య


**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**

బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో అవాంఛ శివశంకర్.తండ్రి వేమన, 42 సంవత్సరాలు. పద్మశాలి, గాంధీనగర్. అనే వ్యక్తి తన తండ్రి చనిపోయినప్పటి నుండి తీవ్ర ఒత్తిడికి గురై ఒంటరిగా ఉంటూ మానసికంగా బాధపడుతూ ఉండేవాడని అదే బాధతో తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్ కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు అని తన భార్య అవాంఛ లహరి ఫిర్యాదు మేరకు 1టౌన్ ఎస్ఐ భూమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని తెలిపారు



# 33వ డివిజన్ లో డ్రైనేజి కుండీలకు మరమ్మత్తులు .

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**



గోదావరిఖని లోని 33వ డివిజన్ లో ప్రమాదకరంగా మారిన డ్రైనేజ్ మీది మూతలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారుల తో మాట్లాడి స్థానికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకముందే నూతన మ్యాన్ హెూల్స్ మూతలను బుధవారం రోజున ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ ఆధ్వర్యంలో మరమత్తులు చేపించడం జరిగిందన్నారు. అనంతరం ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మాట్లాడుతూ 33వ డివిజన్ లో ప్రజలు అనేక సమస్యలతో సతమతమౌతున్నారని సరైన రోడ్లు లేక,అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ సమస్య, మంచి నీటి సమస్య, వీధి లైట్లు సరిగా లేక చీకటి మయం అవుతుందని దానితో ప్రజలు భయాందోళనకు గురైతున్నారని అన్నారు.అన్ని డివిజన్ లో మంచి నీటి సమస్య రోజు విడిచి రోజు కేవలం ఒక గంట ఇవ్వడం వల్ల నీరు సరిపోవడం లేదని కావున రోజు ఒక గంట అయినా మంచి నీటి సరఫరా చేయాలని నగర పాలక సంస్థ అధికారులను కోరారు. 33వ డివిజన్ లోవేసవి కాలం దృష్ట్యా రెండు నూతన బోరింగ్లు వేయాలని,డ్రైనేజి సమస్యను పరిష్కరించాలని,కొన్ని డ్రైనేజి కుండీల మీద మూతలు పూర్తిగా పగిలి శిదిలావస్థకు చేరుకుందని కుండీలపై పైకప్పులు లేకపోయేసరికి దుర్వాసనతో మరియు పాటు దారిన వెళ్లే పాదాచారులు,వాహనదారులు ప్రమాదాలకు దారితీస్తున్నాయని కావున ఇట్టి సమస్యలతో పాటు మరి కొన్ని ప్రధాన సమస్యలను నగర పాలక సంస్థ సంబంధిత అధికారులు, సిబ్బంది ఒక రోజు సందర్శన చేసి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని దినేష్ నగర పాలక సంస్థ అధికారులను కోరారు.

## మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధింపు

**మల్కాజిగిరి మార్చి 26 ప్రజా అక్షరం న్యూస్**



మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక మైనర్ బాలికను రోజూ వెంబడిస్తూ, ప్రేమ పేరుతో వేధిస్తూ, అసభ్యకరంగా ప్రవర్తించిన సంఘటన Cr.NO 449/2014 కేసులో నిందితుడు SK. రహమత్ ఏ మధు S/o దస్తగిరి వయస్సు: 26 సంవత్సరాలు, వృత్తి:వ్యాపారం, R/o HNO: 30-59 గణేష్ నగర్, మౌలా అలీ, మల్కాజ్‌గిరి N/O: యెర్ర గుంట, చంద్ర గుండ (M) ఖమ్మం జిల్లా వాసిని దోషిగా నిర్ధారించడం జరిగింది. మల్కాజ్‌గిరి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులో U/S 354, 354(d), 506,509 ipc సెక్షన్: 8 r/w 12 ఆఫ్ పోక్సో చట్టం మరియు మల్కాజ్‌గిరి స్టేషన్ SC NO: 1479/2022, అత్యాచారం మరియు పోక్సో చట్టం ప్రకారం నేరేడ్‌మెట్‌లోని మేడ్చల్/ మల్కాజిగిరి జిల్లా గౌరవ పోక్సో కోర్టు న్యాయమూర్తి 26/03/2025 తేదీన నిందితుడిని దోషిగా నిర్ధారించారు. ఈ కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష మరియు రూ. 20,000/- జరిమానా విధించబడింది.లి ఈ కేసులో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సుశీల వాదనలు వినిపించారు.

## ఉత్తటూరు గ్రామాన్ని సందర్శించిన రామన్నపేట ఎంపీడీవో యాకూబ్ నాయక్

**రామన్నపేట మార్చి 26**

గర్భిణీ స్త్రీల గృహ సందర్శన జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం రామన్నపేట మండలంలోని ఉత్తటూర్ గ్రామపంచాయతీ యందు గర్భిణీ స్త్రీ బద్దుల మౌనిక గృహ సందర్శనా చేసి సుఖప్రసవం అయ్యే విదంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవం చేయించుకోవాలని ప్రభుత్వ ఆసుపత్రులలో కలిగే లాభాలను వారికి వివరించడం జరిగింది



## శ్రీ శంభు లింగేశ్వర స్వామి దేవాలయంల బ్రహ్మోత్సవాలు

**రామన్నపేట మార్చి 26**

రామన్నపేట మండలం వెల్లంకి గ్రామంలో 26-03-2025. రాత్రి నాలుగు 30 నిమిషాలకు తెల్లవారితే గురువారం 27-03-2025 గురువారం రాత్రి 7 గంటల నుండి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లంకి విద్యార్థులచే సంస్కృతిక కార్యక్రమములు రాత్రి 9 గంటలకు శ్రీ పార్వతీ శంభు లింగేశ్వర స్వామి దివ్య కళ్యాణం 29-03-2025 శనివారం రోజున ఉదయం 6 గంటల నుండి రథోత్సవం సూర్యాపేట కళాకారులచే సంధ్యక్క కోలాట ప్రదర్శన 30-03-2025 ఆదివారం రోజున 11 గంటలకు పంచాంగ శ్రవణం ఉగాది పచ్చడి వితరణ శ్రీ శంభు లింగేశ్వర స్వామి దేవాలయ పాలకవర్గం
పత్రికా ప్రకటనలో తెలిపినారు

## వేసవికాలంలో దొంగతనాలపై అవగాహన కల్పించిన రామన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్

**వలిగొండ మార్చి 26 ప్రజా అక్షరం ప్రతినిధి**

వలిగొండ మండల కేంద్రంలో బుధవారం రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, స్థానిక ఎస్సై యుగంధర్ గౌడ్ తో కలిసి వేసవి కాలంలో దొంగతనాల నివారణ గురించి ప్రజలకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాలలో ఆరు బయట నిద్రించేటప్పుడు ఒంటిపై విలువైన ఆభరణాలు ధరించకూడదని, ఊరికి వెళ్లే సమయాలలో ఇంటిలో విలువైన వస్తువులు, ఆభరణాలు,నగదు ఉంచకూడదని ,బ్యాంక్ లాకర్ లో లేదా భద్రమైన చోట దాచుకోవాలని అన్నారు. ఇంటిలో సీసీ కెమెరాలు సొంతంగా ఏర్పాటు చేసుకొని డివిఆర్ ని రహస్య ప్రదేశాలలో భద్రపరచుకోవాలని సూచించారు. ఎవరి మీదనైనా అనుమానం వస్తే టోల్ ఫ్రీ నెంబర్ 100 /112 కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు. బ్యాంక్ అకౌంట్, ఎటిఎం కార్డు ,ఓటిపి వివరాలు ఎవరికీ చెప్పొద్దని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మండల బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## ఆస్తి పన్ను బకాయిదారులకు బంపర్ ఆఫర్

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**

బకాయిలతో సహా ఆస్తి పన్ను మొత్తం 2025 మార్చి 31లోగా ఒకేసారి చెల్లించి 90 శాతం వడ్డీ మినహాయింపు పొందే సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పెద్దపల్లి జిల్లా అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె, అరుణ శ్రీ ఒక ప్రకటనలో కోరారు. ఈ మేరకు జి ఓ ఆర్ టి నెం.154 ఎం ఎ 2 తేదీ: 2025 మార్చి 25 ద్వారా ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అయ్యాయని పేర్కొన్నారు. 2025 మార్చి 31 నాటికి ఉన్న ఆస్తి పన్ను బకాయిలన్నింటినీ ఏక మొత్తంలో ఒకే సారి చెల్లిస్తేనే వన్ టైమ్ సెటిల్మెంట్ కింద 90 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుందని తెలిపారు.

## జీడికే 2అండ్ 2ఎ గనిని సందర్శించిన బి.వెంకన్న డి డి ఎం ఎస్

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**

బుధవారం జీడీకే 2 అండ్ 2ఎ ఇంక్లైన్ భూగర్భ గనిని బి.వెంకన్న, డి డి యం యస్ సందర్శించడం జరిగినది. ఈ సందర్భంగా భూగర్భ గనిలోని పని స్థలముమలను తనిఖీ చేయడం జరిగినది.భూగర్భ గనిలో ఎస్ఎస్ 13/2 ప్యానెల్ పని స్థలము ను సందర్శించి అక్కడ ఉన్న పని స్థలములలో పైకప్పు మరియు సైడ్‌లను భద్రతతో కూడిన రక్షణ చర్యలను ఎప్పటికప్పుడు జాగర్తగా గమనిస్తూ పటిష్టమైన సపోర్ట్ చేయాలనీ అధికారులకు సూపర్ వైజర్ లకు తెలిపారు. ఈ మధ్యనే డబ్ల్యూసీఎల్,సీఐఎల్ లో రూఫ్ అండ్ సైడ్ ఫాల్ ప్రమాదాలు సంభవించాయని తెలిపారు.అటువంటి వాటికి ఆస్కారం లేకుండా భూగర్భ గనుల్లో పైకప్పు పడిపోవడం అండ్ సైడ్ ఫాల్ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.రక్షణతో కూడిన ఉత్పత్తి చేయాలనీ తెలిపారు.అనంతరం జీడీకే 2అండ్ 2ఎ ఇంక్లైన్ భూగర్భ గనికి సంబంధిత సర్వే రికార్డులను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో వీరితో పాటు బి.సాయి ప్రసాద్,ఏరియా రక్షణ అధికారి,కె.చంద్ర శేఖర్,ఏజెంట్, డి.రమేష్ బాబు,సాట్యుటరి గని మేనేజర్,ఎస్ కె.అల్లావుద్దీన్,గని మేనేజర్,డి.వెంకటేశ్వర్లు,సేఫ్టీ ఆఫీసర్ తదితరులు పాల్గొన్నారు.




## టాటా మ్యాజిక్ వాహనం అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**

గోదావరిఖని బస్టాండ్ అడ్డా టాటా మ్యాజిక్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ పార్టీ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ తాజా మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి, ఆరవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జంగంపల్లి శ్రీనివాస్ హాజరై నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.ఈ ఎన్నికల్లో మారపెల్లి విద్యాసాగర్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీ టి. లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు ఇ.సదానందం తో పాటు మిగతా సభ్యులు ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు.ఈ సందర్బంగా కాంగ్రెస్ పార్టీ తాజా మాజీ ఫ్లోర్ లీడర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ నూతన అధ్యక్షుని నాయకత్వంలో అసోసియేషన్ మరింత అభివృద్ధి చెందాలని, మెరుగైన సేవలు అందించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే ఇతర నూతన కార్యవర్గ సభ్యులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా స్థానిక వ్యాపార వాహనాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు, డ్రైవర్లు, యజమానుల సంక్షేమానికి కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుండేలా చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, సంఘ సభ్యులు, డ్రైవర్లు, యజమానులు పాల్గొని కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.



## మహిళ కనబడుటలేదు

**గోదావరిఖని మార్చి 26 (ప్రజా అక్షరం ప్రతినిధి):-**



రామగుండం కార్పొరేషన్ పరిధిలోని విటల్ నగర్ కు చెందిన ఆడెపు వెంకటలక్ష్మి. భర్త రాజేంద్రప్రసాద్ ,49 సంవత్సరాలు ,పద్మశాలి. ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎక్కడికో వెళ్ళిపోయింది అని తన కొడుకు అయిన ఆడెపు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని,పై వ్యక్తిని గుర్తించిన ఎడల పోలీసు వారికి సమాచారం అందించగలరని 1టౌన్ ఎస్ ఐ సోనియా తెలుపుతూ ఈ క్రింది నెంబర్ లకు 6300827655,లేదా డయల్ 100 చేయాలని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## రాజపేట తహసిల్దార్ గా అనిత బాధ్యతల స్వీకరణ

**రాజపేట,మార్చి 26(ప్రజా అక్షరం):-**



రాజపేట మండల తహసిల్దార్ గా సీసీఎల్ నుండి బదిలీపై వచ్చిన అనిత బుధవారం బాధ్యతల స్వీకరించారు. గత నెల 15వ, తేదీన విధులు నిర్వర్తిస్తున్న దామోదర్ నకిలీ ఏసీబీ వారు బెదిరించగా వారికి 2,80,000 రూపాయలు ఆన్లైన్లో దామోదర్ కుమారుని ద్వారా పంపి బంగపడి, ఆరోపణలు ఎదుర్కోగా 18వ, తేదీ సీసీఎల్ కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో ఫిబ్రవరి 19వ, తేదీ నుండి రాజపేట తహసిల్దార్ ఫుల్ అడిషనల్ చార్జిగా నాయబ్ తహసిల్దార్ వెంకటేశ్వర్లు రెడ్డి వ్యవహరిస్తున్నారు. సీసీఎల్ నుండి బదిలీపై వచ్చిన అనిత బుధవారం రాజపేట తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించారు.

## యువకుడు హరిబాబు ఆత్మహత్య

**రాజపేట,మార్చి 26(ప్రజా అక్షరం):-**



రాజాపేట మండలం మల్ల గూడెం గ్రామానికి చెందిన రెడ్డబోయిన హరిబాబు ఎలియాస్ అభి 19 ఆత్మహత్య చేసుకున్న విషయం బుధవారం వెలుగులోకి వచ్చింది. ఏఎస్ఐ మైసయ్య, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 21వ తేదీన రెడ్డబోయిన హరిబాబు ఇంటి నుండి వెళ్లిపోగా, హరిబాబు తండ్రి మల్లేశం గ్రామస్తులు వెతకగా జాడ తెలియకపోవడంతో 24వ, తేదీ స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఏఎస్ఐ మైసయ్య మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. కాగా బుధవారం ఉదయం ఊరి పొలిమేరలోని మొల్లగుట్ట వద్ద వేప చెట్టుకు తాడుతో హరిబాబు ఉరేసుకున్నట్లు గుర్తించారు. ఈ విషయాన్ని స్థానిక పోలీసులకు తెలుపగా శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ మైసయ్య చెప్పారు.

## ధర్మబిక్షం ఆశయ సాధనలో భాగస్వామ్యులు కావాలి.

**రాజాపేట,మార్చి 26(ప్రజా అక్షరం):-**

రాజపేట మండలం లో బేగంపేట గ్రామంలో గౌడ సంఘ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ, సిపిఐ నేత బొమ్మగాని ధర్మం బిక్షం 14వ, వర్ధంతి సందర్భంగా గీతా పని వారి సంఘం అధ్యక్షులు బావుపేట వెంకటయ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగింది. బొమ్మగాని ధర్మం బిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ రైతాంగానికి గీత కార్మికులకు ఎనలేని సేవలందించారని గుర్తు చేశారు. వారి నిజమైన హక్కుల కోసం ధర్మ బిక్షం నిరంతరం శ్రమించి సఫలీకృతులయ్యారని తెలిపారు. గీతా పని వారి సంఘం వ్యవస్థాపకులు నాయకులు, గీత కార్మికులు పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా పాసిపిఐ పార్టీ మండల కార్యదర్శి చిగుర్ల లింగం మాట్లాడారు. ఉపాధ్యక్షులు జల్ల బిక్షపతి, డైరెక్టర్ జిల్లా బాల్నగర్, జల్ల వెంకటయ్య, బొమ్మగాని బాల నర్సు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొమ్మగాని ధర్మం బిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసే నివాళు లు అర్పించారు.



## టిఆర్ఎస్వి యువజన నాయకుడు మోత్కుపల్లి బాలకృష్ణకు ఆర్థిక సహాయం

**రాజాపేట,మార్చి 26 (ప్రజా అక్షరం):-**

ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మోత్కుపల్లి బాలకృష్ణ కి ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ బుధవారం 5000 రూపాయల ఆర్థిక సాయం మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేష్ ద్వారా అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆరెస్ మండల పార్టీ మహిళ అధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మండల పార్టీ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్ గౌడ్, ఆత్మ డివిజన్ చైర్మన్ మేక వెంకటేశ్వర రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకులు మండల పార్టీ ఉపాధ్యక్షులు ఎర్ర గోకుల జస్వంత్, రాజపేట పట్టణ శాఖ అధ్యక్షులు బెడిదే వీరేశం, ముదిరాజ్ సంఘం మండల శాఖ అధ్యక్షులు పులి చంద్రమౌళి, ఉల్లి రమేష్ గౌడ్, వరిమడ్ల బాలకృష్ణ, సుదం నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బూడిద బిక్షమయ్య గౌడ్ కు మోత్కుపల్లి బాలకృష్ణ కృతజ్ఞతలు చెప్పారు.



## ఉపాధి కూలీలకు అండ

### పని క్షేత్రాల్లో రక్షణ చర్యలు

**నిజామాబాద్,మార్చి26(ప్రజా అక్షరం):**

జిల్లాలో వేసవి నిబంధనలతో ఉపాధిహామీ పనులను చేపడుతున్నారు. పూర్తి రక్షణ చర్యలతో పనులకు హాజరయ్యేలా డీఆర్‌డీవో అధికారులు ప్రణాళికలు తయారు చేశారు. మరోవైపు ఎండల ప్రభావం అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో వసతులు కల్పిస్తున్నారు. నీడతో పాటు మంచినీటి సదుపాయం కల్పిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామసభల్లో గుర్తించిన పనులను చేపడుతూ స్థానికులకు ఉపాధి కల్పిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో ఉపాధి హామీ పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఉపాధిహామీ పథకంలో భాగంగా నీటిగుంటలు, ఇంకుడు గుంతలు, మొక్కల పెంపకం, కందకాలు, చెక్‌డ్యాం కాలువల్లో పూడికతీత పనులు ఊటకుంటలు, టేకు నర్సరీలు, కిచెన్ షెడ్‌లు, గడ్డి పెంపకం, పశువుల నీటి తొట్టెలు, పండ్లతోటల పెంపకం, డంపిగ్‌యార్డులు, మరుగుదొడ్ల నిర్మాణం, నీటి నిల్వలకు సంబంధించిన పనులు, ప్రభుత్వ పాఠశాలలో వంటశాలల నిర్మాణాలను చేపడుతారు.కూలీల సంఖ్యను మరింత పెంచేందుకు ఎంపీడీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనుల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. కూలీలకు పనిరోజులు కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందుకోసం అధికారులు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ బృందాలు గ్రామాల్లో పర్యటిస్తూ పనులను పర్యవేక్షిస్తాయి. జూన్‌నాటికి నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తి చేస్తామని అధికారులు అంటున్నారు. పేదలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంలో కేంద్రం ప్రవేశపెట్టిన జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. వేసవిలో గ్రామాల్లోని పేదలు వ్యవసాయ కూలీలు పనులు లేకపోవడంతో ఎక్కువ మంది ఉపాధిహామీ పనులపై ఆధారపడుతున్నారు.

Printed, Published and owned by bhupathi; Srinivas , H.NO-1-111,village burugupally, Mandel Rajapet,District Yadhagiri Bhuvanagiri, Telangana-508105 Editor; BhupathiSrinivas, RNA Tel Tel 20684